
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం 25 అక్టోబరు 2025

మరింత వేగంగా..

- చురుగ్గా సాగుతున్న ఖమ్మం మోడల్ మిర్చి మార్కెట్ పనులు
- మంత్రి తుమ్మల చొరవతో రూ.155కోట్లతో ఆధునికీకరణ
- రైతులకు సకల వసతులు కల్పించేలా ప్రణాళికలు



చకచకా సాగుతున్న నిర్మాణ పనులు

ఖమ్మం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలోనే మిర్చి అమ్మకాల్లో ప్రముఖ మార్కెట్‌గా ఉన్న ఖమ్మం వ్యవసాయ మిర్చిమార్కెట్ రూపురేఖలు మారున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో రాష్ట్రంలోనే ఒక మోడల్ మిర్చి మార్కెట్‌గా ఆధునికరణ పనులు మరింత వేగంగా సాగుతున్నాయి. రూ.155కోట్లతో చేపట్టిన ఈ పనులను నిర్ణీత గడువుకంటే పూర్తిచేయాలని మార్కెట్ పునర్నిర్మాణ పనుల భూమిపూజ సమయంలో మంత్రి తుమ్మల నిర్మాణసంస్థకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఒక షెడ్ నిర్మాణాన్ని పూర్తిచేయగా.. మిర్చి సీజన్ వచ్చేనాటికి మిగిలిన పనులను పూర్తిచేసేలా కసరత్తు చేస్తున్నారు. కొత్తగా నిర్మిస్తున్న షెడ్లతోపాటు ఏసీ గోదాం, రైతులకు విశ్రాంతి గదులు, మిర్చిబస్తాలు తడవకుండా ఉండేలా షెడ్లు, గోదాంలు, అధునాతన వసతులుతో ఈమార్కెట్ రూపకల్పన జరిగింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సకల సౌకర్యాలు రైతులకు కల్పిస్తూ రూ.155కోట్లతో ఈ మార్కెట్ పనులు ప్రభుత్వం చేపట్టింది.

మిర్చి కొనుగోళ్లలో రెండో స్థానం..

1937లో ప్రారంభమైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 1967లో మిర్చి యార్డు ఏర్పాటుచేసి ఇక్కడ కొనుగోలు ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో గుంటూరు తర్వాత ఖమ్మంమిర్చి మార్కెట్లోనే కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ కొనుగోళ్లలో రెండోస్థానంలో ఉంది. ప్రతిరోజు 50వేలనుంచి 80వేలవరకు.. సీజన్‌లో అయితే లక్షన్నర బస్తాల కొనుగోళ్లు జరుగుతాయి. ఇక్కడ కొనుగోలైన మిర్చిని వ్యాపారులు దేశవిదేశాలకు ఎగుమతి చేస్తారు. ఇక్కడి తేజరకం మిర్చికి చైనా, సింగపూర్, మలేషియా, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాల్లో డిమాండ్ ఉంది. దేశంలోని ఢిల్లీ, గుజరాత్, యూపీ, నాగపూర్, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాలకు కూడా ఖమ్మం మిర్చి ఎగుమతవుతుంది. ఏటా సుమారు రూ.10వేల కోట్లపైగా వ్యాపారం జరుగుతుంది. దీంతో ఈ మిర్చి (మిగతా 6వ పేజీలో)

మిర్చి మార్కెట్‌లో సకల సౌకర్యాలు : మంత్రి తుమ్మల



ఖమ్మం వ్యవసాయమిర్చి మార్కెట్‌లో సకల సౌకరాలు కలిపించేలా రూపకల్పన చేసి నిర్మాణం చేయనున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మార్కెట్‌కు నిధులు మంజూరుచేసి నిర్మాణానికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిర్చిపంటను అమ్ముకోవడంతో పాటు ఖమ్మంమిర్చి మార్కెట్‌కు ఒక భరోసా రైతులకు రావాలన్నదే తన లక్ష్యమని, రైతులతోపాటు కార్మికులు కూడా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మార్కెట్ ఏర్పాటు జరుగుతుందని, పనులు వేగవంతంగా చేపట్టి పూర్తిచేస్తామన్నారు.

జిల్లాలో ఐదు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

- మద్దతు ధరకు విక్రయించాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర
- 5,456 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా



ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్నలు కొనుగోలు చేసేందుకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సీజన్‌లో మొక్కజొన్న పంటకు ప్రభుత్వం ప్రతి క్వింటాలుకు రూ.2,400 కనీస మద్దతు ధరను ప్రకటించిందని ఆయన తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు పక్కా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,705 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 5,456 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాలున్నాయన్నారు. రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా, రైతులు తమ పంటను తడిశాతం 14శాతంలోపు ఉండేలా చూసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మధిర, ఎర్రుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో, ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో, సింగరేణి మండలం మాధారంలో కారేపల్లి సహకార సొసైటీలో, ముదిగొండలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు మొక్కజొన్న తేమ శాతం 14శాతం లోపు ఉన్న పంటలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



29న కాశీలో రామయ్య కల్యాణం

- నేడు తరలివెళ్లనున్న వైదిక అధికారుల బృందం
- నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
- స్వర్ణకవచాలతో దర్శనమిచ్చిన రామయ్య 7

నేడు నాగులచవితి 7

కర్నూలు బస్సు ప్రమాదంలో..
వల్లభి యువకుడి దుర్మరణం

- మృతుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..
- దీపావళికి వచ్చి విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ఘటన
- తల్లడిల్లిన తల్లిదండ్రులు.. స్వగ్రామంలో తీవ్ర విషాదం
- అద్దాలు బద్దలుకొట్టి ప్రాణాలు దక్కించుకున్న సత్తుపల్లి యువకుడు సత్యనారాయణ





పూర్తిగా దగ్ధమైన బస్సు, మృతిచెందిన వల్లభి వాసి మేఘనాథ్ (ఫైల్)

● మృత్యుంజయుడు



ఐదు నిమిషాల్లో అంతా అయిపోయింది
మన్నేపల్లి సత్యనారాయణ

ముదిగొండ/సత్తుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటన తీరని విషాదాన్ని మిగిల్చింది. భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో కొద్దినెలల క్రితమే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా జీవితాన్ని ఆరంభించిన ఓ యువకుడు అగ్నికీలల్లో బూడిదయ్యాడు. ఇదే బస్సులో ప్రయాణిస్తున్న సత్తుపల్లికి చెందిన ఓ యువకుడు బస్సు అద్దాలు బద్దలు కొట్టుకుని బయటపడి ప్రాణాలు కాపాడుకున్నాడు. దీనికి సంబంధించిన వివారాలివీ..

ఉద్యోగం జీవితం ప్రారంభించిన కొద్ది నెలలకే..

ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన చిట్టోజు శ్రీనివాసరావు, విజయలక్ష్మీ దంపతులకు కుమారుడు మేఘనాథ్ (25), కుమార్తె యశ్విని (మిగతా 6వ పేజీలో)

భార్యను హతమార్చిన భర్త

- తమను వదిలేసి వెళ్లిపోయిందన్న కోపంతో హత్య
- ఏన్కూరు మండలం కాలనీ నాచారంలో ఘటన 6

కుమారుడు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- కూల్‌డ్రింక్‌లో కలుపు నివారణ మందు కలిపి తాగిన వైనం
- ఇద్దరి పరిస్థితి విషమం.. ఖమ్మం ఆస్పత్రికి తరలింపు
- కిందపడేసి ప్రాణాలు కాపాడుకున్న పెద్ద కుమారుడు..
- కుటుంబ కలహాలే కారణం..
- సత్తుపల్లిలో ఘటన 7

బోనస ఎన్నాళ్లు?



గత యాసంగి సన్నవడ్లకు ప్రోత్సాహక సొమ్ము చెల్లింపుపై సర్కారు నాన్చివేత ధోరణి

- మళ్లీ ఎండాకాలం సీజన్ వస్తున్నా అందని రూ.63.63కోట్లు
- బోనస్ కోసం జిల్లాలో 18,893 మంది రైతుల ఎదురుచూపు

వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : సన్న రకం వరి సాగును ప్రోత్సహించే క్రమంలో ప్రభుత్వం మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్‌గా ఇస్తోంది. ఈ క్రమంలో గతేడాది యాసంగి సీజన్‌కు సంబంధించిన ప్రోత్సాహక సొమ్ములను సర్కారు నేటికీ రైతులకు చెల్లించలేదు. ఇక ఈ ఏడాది వానాకాలం సీజన్ కూడా చివరి దశకు వస్తుండగా.. మరికొద్దిరోజుల్లోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభంకానున్నాయి. ఆ వెంటనే యాసంగి సాగు కూడా మొదలవుతుంది. కానీ నేటికీ గత యాసంగి సీజన్ సన్నరకాల ధాన్యానికి సంబంధించిన బోనస్ సొమ్మును చెల్లించకుండా ప్రభుత్వం నాన్చుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంజిల్లాలో 18,893మంది రైతులు తమకు రావల్సిన రూ.63.63కోట్ల బోనస్ సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. గత యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లు ఈ ఏడాది ఏప్రిల్, మే మొదటి వరకు కొనసాగాయి.

పెండింగ్‌లో రూ.63.63కోట్లు..

పోయిన యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో 34,305మంది రైతుల నుంచి 2,36,036మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ మొత్తం ధాన్యానికి మద్దతు ధర(ఎంఎస్పీ) కింద రూ.545.55కోట్ల నిధులను చెల్లించింది. ఈ మొత్తం ధాన్యంలో 18,893మంది రైతులకు చెందిన 1,27,271మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉండగా.. ఈ రైతులకు రూ.63.63కోట్ల బోనస్ సొమ్ము చెల్లించాల్సి ఉంది. ఇవి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. బోనస్ సొమ్ము రాకముందే మళ్లీ వానాకాలం ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రారంభించింది. ఖమ్మంజిల్లాలో 327కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ సారి దాదాపు 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే కల్లూరు మండలంలో 35కొనుగోలు కేంద్రాలను, సత్తుపల్లి మండలంలో 19కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయినప్పటికీ గత యాసంగి సన్నరకాల బోనస్ సొమ్ము ఊసే లేదు. రాష్ట్రం మొత్తం మీద రూ.1,168కోట్ల బోనస్ సొమ్ము పెండింగ్‌లో ఉండగా ఒక్క ఖమ్మంజిల్లాలో రూ.63.63కోట్లు పెండింగ్‌లో ఉంది. ఖమ్మంజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి అయిన మల్లు భట్టి విక్రమార్క పేషీలో సన్నరకాల బోనస్ సొమ్ము చెల్లింపుల ఫైలు పెండింగ్‌లో ఉందని అధికార వర్గాలు చెపుతున్నాయి.

మండలాల వారీగా బోనస్ పెండింగ్ ఇలా..

నేలకొండపల్లి మండలంలో 3,450మంది రైతులు, తల్లాడలో 1890మంది, కూసుమంచిలో 2,202మంది, కల్లూరులో 1,310, ముదిగొండలో 1,980, వేంసూరులో 1,420, పెనుబల్లిలో 1,053, తిరుమలాయపాలెంలో 1,282, సత్తుపల్లిలో 1,056, ఖమ్మం రూరల్‌లో 986, వైరాలో 260, కొణిజర్ల 732, చింతకానిలో 394, రఘునాథపాలెంలో 302, ఏన్కూరులో 170, బోనకల్‌లో 173, మధిరలో 62, కామేపల్లిలో 70, ఖమ్మం అర్బన్‌లో 58, ఎర్రుపాలెంలో 16, సింగరేణిలో 27మంది రైతులు బోనస్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలై రైతులు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను సాగుచేశారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అయినకాడికి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. కనీసం పోయిన యాసంగి బోనస్ సొమ్ము వ్యవసాయ పెట్టుబడులకు ఉపకరిస్తుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఒకవేళ ప్రభుత్వం ఆలస్యంగా బోనస్ సొమ్ము చెల్లించినా పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్ద తెచ్చిన సొమ్ముకు వడ్డీలు చెల్లించటానికి కూడా సరిపోవని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ పెట్టుబడుల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే బోనస్ సొమ్ము తమ ఖాతాల్లో జమచేసి సహకరించాలని రైతులు కోరుతున్నారు.

మధిర ఓఆర్ఆర్‌కు ఆమోదం

- రూ.193కోట్లతో హ్యామ్ విధానంలో జరగునున్న రింగ్‌రోడ్డు నిర్మాణం
- డివిజన్‌లో రూ.400కోట్లతో 32 ప్యాకేజీల్లో రహదారుల పనులు
- పట్టణంలో ట్రాఫిక్ కష్టాలకు మోక్షం 7



ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికిగాను మధిర మండలం కృష్ణాపురం వద్ద గతంలో అధికారులు వేసిన మార్కింగ్

చిరు వ్యాపారులకు..
ఆర్థిక భరోసా

- టైలరింగ్ నుంచి వీధి వ్యాపారుల వరకు రుణాలు
- వ్యాపార ఫొటో, ఆధార్ జిరాక్స్‌తో రూ.20వేల నుంచి రూ.50వేలు మంజూరు
- 2025-26 ఏడాదిలో 4,682 మంది వ్యాపారులకు రుణాలు

ఖమ్మం నగరంలోని మేకలబండ పార్కు సమీపంలో నివాసం ఉంటున్న మర్రి రమ్య తన ఇంట్లో చిన్న కుట్టు మిషన్ పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమెకు కుట్టు మిషన్ పరికరాలు, ఇతర దుస్తుల కొనుగోలుకు పెట్టుబడి లేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రమ్యకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆర్పీలు అండగా నిలిచారు. ప్రధానమంత్రి స్వనిధిలోని లోక్‌కళ్యాణ్ మేళా రుణాలపై వివరించారు. 2023లో తొలిసారిగా మర్రి రమ్య రూ.10వేల రుణం తీసుకున్నారు. బ్యాంకుకు సక్రమంగా చెల్లింపులు చేయటంతో 2024లో తిరిగి రూ.20వేలు రుణాలను పొందారు. వాటిని నెలకు రూ.15,953 చొప్పున క్రమం తప్పకుండా చెల్లింపు చేయడంతో.. ఇప్పుడు రూ.50వేల రుణానికి అర్హత పొందారు. శుక్రవారం ఖమ్మం మెప్మా అధికారులను కలిసి తనకు రూ.50వేలు రుణం మంజూరు చేయాలని కోరారు.

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటును అందించేందుకు ప్రధానమంత్రి స్వనిధి పథకంలో గతేడాది వరకు రూ.10వేలు చెల్లించేవారు. ఆ తర్వాత రూ.20వేలు, మూడోసారి రూ.50వేల రుణం ఇస్తున్నారు. 2025-26 ఏడాదికిగాను రుణ పరిమితిని పెంచారు. లోక్‌కళ్యాణ్ పేరుతో పథకంలో మార్పులు చేశారు. తొలివిడత రుణంగా రూ.15వేలు, తర్వాత రూ.25వేలు, మూడో విడతగా రూ.50వేలు అందిస్తున్నారు. కుట్టు మిషన్ నుంచి చిరు వ్యాపారులు, వీధి వ్యాపారుల వరకు రుణాలను పొందే వెసులుబాటు కల్పించారు.



ఆన్‌లైన్ చేస్తున్న మెప్మా కంప్యూటర్ ఆపరేటర్

సులువుగా రుణాల మంజూరు

లోక్‌కళ్యాణ్ మేళాకు సాధారణ ఆధారాలతోనే రుణాల మంజూరు జరుగుతాయి. వ్యాపారం చేసే వారి ఆధార్ జిరాక్స్‌తో పాటు వ్యాపారం ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలను మెప్మా కార్యాలయంలో అందిస్తే మెప్మా కంప్యూటర్ అపరేటర్లు వారి వివరాలను ప్రధానమంత్రి స్వనిధి లోక్‌కళ్యాణ్ మేళాలో నమోదు చేస్తారు. తర్వాత రుణాల మంజూరు జరుగుతాయి.

2025-2026 రుణ లక్ష్యాల కేటాయింపు

ఖమ్మం జిల్లాలోని ఖమ్మం నగర పాలక సంస్థతో పాటు మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో లోక్‌కళ్యాణ్‌మేళా 2025-2026 రుణ లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించింది. రుణాల లక్ష్యాలను మూడు విడతలుగా నిర్ణయించారు. ప్రతీ నాలుగు నెలల చొప్పున లక్ష్యాలను కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా ఏడాదికి 4,682 మంది వ్యాపారులకు రుణాలను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా.. ఖమ్మం నగరంలోని కొన్ని బ్యాంకుల మేనేజర్లు రుణాలను వెంటనే మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. పొంతన లేని ఇతర రుణాల బకాయిలను చెల్లిస్తేనే చిరు వ్యాపారులకు రుణాలను ఇస్తామని అడ్డంకులు సృష్టిస్తున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

మునిసిపాలిటీ	చిరు వ్యాపారులకు
ఖమ్మం	2,982
సత్తుపల్లి	177
మధిర	265
వైరా	191
కల్లూరు	300
ఏదులాపురం	767

సింగరేణిలో మెరుగైన వైద్య సేవలు

ఆధునిక వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యం
రిఫరల్‌ను తగ్గించే ప్రయత్నం
50 మంది వైద్యుల నియామకం



సింగరేణి ప్రధాన ఆసుపత్రి దృశ్యం

కొత్తగూడెంటౌన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి యాజమాన్యం కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుంది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. తెలంగాణలోని ఆరు జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణిలో సుమారు 39వేల మంది కార్మికులు వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు సింగరేణి యాజమాన్యం 11 ఏరియాల్లో 7 ఆసుపత్రులు, 21 డిస్పెన్సరీలను కొనసాగిస్తుంది. ఇటీవల కాలంలో ప్రతీ చిన్న వైద్యానికి హైదరాబాద్‌కు రిఫరల్ చేయడం ద్వారా యాజమాన్యంపై ఆర్థిక భారం పడడంతో పాటు కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని సింగరేణి ఆసుపత్రుల్లో స్పెషలిస్టు నియామకాలకు చర్యలు చేపట్టింది. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు, సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్‌లు వైద్యరంగం అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఇటీవల కాంట్రాక్ట్ పద్ధతిలో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల నియామకంతో పాటు స్పెషలిస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. దీంతో 23మంది వైద్యులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోగా స్పెషలిస్టు డాక్టర్లను 32 మందిని నియమించారు. దీంతో సింగరేణి ఆసుపత్రిలో వైద్యుల కొరత చాలావరకు తీరింది.కొత్తగూడెం, గోదావరిఖని, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణపూర్, ఇల్లెందు, మణుగూరు, భూపాలపల్లి, రామగుండం-1, రామగుండం-2 ఏరియాల్లో పనిచేస్తున్న కార్మికులు అనారోగ్యానికి గురైతే కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రికి రావడం, మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌లోని పలు కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫరల్ చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇటీవల సింగరేణి చైర్మన్ బలరాం వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించి రిఫరల్స్ తగ్గించి కార్మికులకు మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వైద్యుల నియామకాలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో స్పెషలిస్టు వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టారు. దీంతో 7 ఆసుపత్రులతో పాటు 21 డిస్పెన్సరీల్లో కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. సింగరేణిలో వైద్యుల కొరత లేకుండా మరో నోటిఫికేషన్‌ను విడుదల చేసి వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టడానికి యాజమాన్యం సానుకూలంగా ఉన్నట్లుతెలుస్తుంది. కార్మిక సంఘాలు సైతం నూతన వైద్యుల నియామకం చేపట్టడం పట్ల హర్షం ప్రకటిస్తున్నారు.



మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం..

సింగరేణి కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తాం. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో వైద్యుల కొరత లేకుండా చూస్తున్నాం. నూతనంగా సింగరేణిలో చేరిన వైద్యాధికారులు రోగుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వైద్య సేవలు అందించాలి. సింగరేణి చైర్మన్ బలరాం, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు ఆదేశాల మేరకు ఆసుపత్రుల్లో మరిన్ని సదుపాయాలను సమకూర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- రాజ్ కిరణ్ కుమార్,
సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యాధికారి

జడ్పీ బాలికల పాఠశాల అభివృద్ధి భేష్

పాఠశాల హెచ్ఎంకు ప్రశంసాపత్రం
అందజేసిన పాఠశాల విద్య డైరెక్టర్
డాక్టర్ నవీన్ నికోలస్


ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డైరెక్టర్


అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు నిర్వహణ అత్యున్నత ప్రమాణాలతో ఉండటంతో ఆ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోటమల్ల రమకు పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ప్రధానోపాధ్యాయురాలికి ఈ ప్రశంసా పత్రాన్ని డైరెక్టర్ నవీన్ నికోలస్ అందజేయడం జరిగింది. ఇటీవలికాలంలో ఈ పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంలో ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఎంతగానో కృషి చేశారు. రూ.3.50 లక్షలతో పాఠశాలకు అదనపు తరగతి గదులు, రూ.60వేలతో స్టేజీ, ఎంపీ గ్రాంట్ కింద రూ.15లక్షలతో సీసీ రహదారి, లైబ్రేరీ నిర్వహణ అత్యున్నత స్థాయిలో ఉంది. ముఖ్యంగా ఈ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో 72శాతం నుంచి 92 శాతంకు పెరగడం విశేషం. అలాగే 390 మంది విద్యార్థులుండగా ఈ నూతన విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 477కి పెరిగింది. ఇదే కాకుండా జాతీయ ఉపకార వేతనాలకు ఈ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. అదే విధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర జాతీయస్థాయిలో తమ సత్తా చాటారు. ఈ నేపథ్యంలో భద్రాచలం జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల అభివృద్ధి నిర్వహణ తీరును గుర్తించి అభినందించడమే కాదు ప్రశంసా పత్రాన్ని సైతం హెచ్ఎంకు పాఠశాల విద్యా డైరెక్టర్ డాక్టర్ ఈ.నవీన్ నికోలస్ అందజేశారు. ఇదిలా ఉండగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొంది ప్రశంసాపత్రాన్ని స్వీకరించిన హెచ్ఎం తోటమళ్ల రమను యుటీఎఫ్ నాయకులు అభినందించి సన్మానించారు.

నిజాయితీ చాటుకున్న హోంగార్డు ఆఫీసర్

అభినందించిన కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్


పోగొట్టుకున్న పర్సును అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ కరుణాకర్, హెచ్‌వో సలీం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): దొరికిన పర్స్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అందజేసి నిజాయితీ చాటుకున్న హోంగార్డ్ ఆఫీసర్ (హెచ్‌వో) సలీంను శుక్రవారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ప్రత్యేకంగా అభినందించారు. కొత్తగూడెం కోర్టు నందు పీపీ కార్యాలయం నందు పని చేయుచున్న హెచ్‌జీ-191 సలీంకు ఏన్కూర్ మండలం నాచారం ప్రాంతానికి చెందిన సోడే ఆంజనేయులు అనే వ్యక్తికి పర్స్ దొరకగా అతను వెంటనే కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆ పర్సును అప్పగించాడు. పర్సులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా సదరు ఆంజనేయులుని వన్‌టౌన్ సీఐ కరుణాకర్ పిలిపించి ఆ పర్సును, అందులో వివిధ బ్యాంక్‌ల ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, పాన్‌కార్డు, రూ.1400 నగదును అందజేశారు. ఈ విషయంలో నిజాయితీ కనబరిచిన సదరు హోంగార్డ్ ఆఫీసర్ సలీంను ఆర్ఐ నరసింహారావు, యూనిట్ ఇన్‌చార్జ్ సత్తార్, జిల్లా హోంగార్డు అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, సిబ్బంది అభినందించారు.

‘పేట’ సొసైటీలో రూ.57.72లక్షల దుర్వినియోగం

తుది విచారణ చేపట్టిన కో ఆపరేటివ్ సొసైటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్

అశ్వారావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట సొసైటీలో జరిగిన నిధుల దుర్వినియోగం, సీఈవో విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంశాలపై శుక్రవారం కో ఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజశేఖర్‌రెడ్డి అశ్వారావుపేట సొసైటీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. గతంలో 1964 సహకార చట్టం 51వ నిబంధనను అనుసరించి అశ్వారావుపేట సొసైటీలో రూ.67,72,995 దుర్వినియోగం అయినట్లు గత విచారణలో గుర్తించడం జరిగిందని.. దీనిపై విచారణకు హాజరు కావాలంటూ మాజీ సీఈవో విజయ్‌బాబు, ప్రస్తుత సీఈవో గిరి, పాలకవర్గానికి జిల్లా సొసైటీ కార్యాలయం నుంచి లిఖితపూర్వకంగా నోటీసులు పంపారు. ఈ నోటీసుల ప్రకారం శుక్రవారం అశ్వారావుపేట సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, సిబ్బందిని రాజశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు.

- అశ్వారావుపేట సొసైటీ నుంచి వైఎస్సార్ హార్టికల్చర్ సెంటర్, నారంవారిగూడెం, కోకోనట్ గ్రోయర్స్ సెంటర్, వ్యవసాయ కళాశాలకు మొత్తం రూ.6,46,784 విలువ చేసే ఎరువులను సరఫరా చేశారు. ఆయా సంస్థల నుంచి వసూలు చేసిన సొమ్ములో రూ.4,55,000లను రికార్డుల్లో జమ కాలేదు. అలానే అరుణ, గిరి, సందీప్‌కుమార్ కుమార్‌లకు సూపర్, యూరియా, పొటాష్‌లు సరఫరా చేసిన సొమ్ము రూ.2,29,444లు నిధులు దుర్వినియోగం అయినట్టు గుర్తించినట్టు సమన్లలో పేర్కొన్నారు. 2021 నుంచి నేటి వరకు ఊహాజనితమైన ఖర్చులకింద రూ.4,59,000లు పెట్టినట్టు చూపించారన్నారు.
- మండలంలోని అశ్వారావుపేట, ఊట్లపల్లి, కేశప్పగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాల కోసమని సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ నుంచి తెచ్చిన బస్తా సంచులకు రూ.2,09,000లు చెల్లించకపోవడంతో.. వాటిని ధాన్యం కొనుగోళ్ల నుంచి ఆ సంస్థ రికవరీ చేసుకున్నారు.
- దమ్మపేట మార్కెట్ కమిటీ నుంచి కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేసేందుకు 160 టార్పాల్స్ ప్యాడీ క్లీనర్స్, మోయిశ్చర్ యంత్రాలు, ఎలక్ట్రికల్ వెయింగ్ యంత్రాలు, హస్క్ రిమూవర్స్ వంటివి రూ.6,01,954 విలువైన వాటిని సొసైటీ ద్వారా తెచ్చి వాటిని తిరిగి ఇవ్వలేదు. వీటి రికవరీ కోసం మార్కెట్ కమిటీ సొసైటీకి నోటీసులు పంపారు. ఈ నిధులు దుర్వినియోగం అయినట్టు గుర్తించారు.

అలానే గారపాటి నాగమణి అనే రైతు అప్పు రూ.1,30,000 వసూలు చేసి క్యాష్ బుక్‌లో నమోదు చేయలేదు. 2020-21లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి నేరుగా మిల్లర్లతో అప్పటి సీఈవో కుమ్మక్కై ట్రక్కు షీట్లు లేకుండా ధాన్యం లోడులను మిల్లర్లకు తోలారు. వీటి విలువ రూ.21,68,000 ఉన్నట్టు నోటీసులో పేర్కొన్నారు.

- అలానే 1290 జీలుగు విత్తనాల బ్యాగ్‌లు, 2120 బ్యాగ్‌ల జనుములు విలువ రూ.2,24,942-00లు అమ్మేసుకొని స్టాక్ రిజిస్టర్‌లో ఇప్పటికీ నిల్వ ఉన్నట్టు చూపుతున్నారు.
- 2020-21 మొక్కజొన్న కొనుగోళ్ల నిమిత్తం రవాణా చార్జీలు రూ.9,36,000 సొసైటీకి చెల్లించిన సొమ్ము నగదు పుస్తకంలో లెక్కలు కనిపించడం లేదు.
- అదే విధంగా 44,708 గన్నీబ్యాగ్‌లకు సంబంధించి రూ.10,50,930-00లు రైతులకు చెల్లించాల్సిన సొమ్మును సీఈవో, మార్క్‌ఫెడ్, కాంట్రాక్టర్ కలిసి దుర్వినియోగం చేసినట్టు పేర్కొన్నారు.

పైన తెలిపిన పలు అంశాలలో మొత్తం రూ.67,72,995 నిధులు దుర్వినియోగం అయినట్టు గుర్తించామని శుక్రవారం జరిగిన పాలకవర్గ సభ్యుల ముందు ఉంచి అందరినీ లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని కోరినట్టు తెలుస్తోంది. విచారణ సమయంలో రూ.10లక్షలకు కొన్ని ఆధారాలు చూపించారని, మిగతా రూ.57.70 లక్షలకు లెక్కలు సరిగా లేకపోవడంతో నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. విచారణ సమయంలో పాలకవర్గ సభ్యులు దీనంతటికి బాధ్యులు సీఈవో నేనని, తమకు ఏవిషయం చెప్పేవారు కాదని తెలుస్తోంది. కాగా.. ఆయా అంశాలన్నింటిపై అందరి వద్ద నుంచి వ్యక్తిగతంగా స్టేట్మెంట్‌లు తీసుకున్నామని, ఈ నివేదికను జిల్లా సొసైటీ అధికారికి నివేదించనున్నట్టు విచారణ అధికారి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మరోవైపు.. అశ్వారావుపేట సొసైటీలో లక్షల రూపాయలు నిధులు దుర్వినియోగం అంశం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే సీఈవో విజయ్‌బాబు సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు ఏం తీసుకుంటారో అన్నది మున్ముందు వేచి చూడాల్సిందే..!

మరింత వేగంగా..

(5వ పేజీ తరువాయి)

మార్కెట్‌పై వేలాదిమంది రైతులు వందల సంఖ్యలో వ్యాపారులు, కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు.

వసతుల్లేక నష్టాలు, కష్టాలు..

మిర్చి మార్కెట్‌లో సరైన వసతులు లేక తెచ్చి మిర్చి వర్షం, గాలులకు తడిచి, అగ్నిప్రమాదాలకు దగ్ధమై రైతులు నష్టపోయిన సందర్భాలున్నాయి. రాష్ట్రంలో మిర్చి మార్కెట్‌కు సకల సౌకర్యాలు, రైతులు వ్యాపారులకు కల్పించేలా మిర్చి షెడ్లు ప్లాట్‌ఫారాలు, మీటింగ్‌హాల్, విశ్రాంత గదులు, భోజనశాల, ఏసీ గోదాంలు, ఆర్వోఆర్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, తదితర సౌకర్యాలతో 15ఎకరాల్లో ఆరుషెడ్ల నిర్మాణం జరుగుతోంది. దేశంలోనే పేరున్న ప్రీ ఇంజనీరింగ్ బిల్డింగ్ టెక్నాలజీ నిర్మాణ సంస్థ ఈపనులు చేపట్టింది. మిర్చివ్యాపారులకు కూడా మీటింగ్‌హాళ్లతో పాటు వారికి కావాల్సిన వసతులు ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నారు. పరిపాలన భవనం మూడంతస్థుల నిర్మాణం జరగబోతుంది. అలాగే దడవాయిలకు కూడా సమావేశ మందిరం ఏర్పాటుచేస్తున్నారు. ఒక్కో షెడ్ 121మీటర్ల పొడవు, 27మీటర్ల వెడల్పుతో నిర్మాణం జరుగుతుంది. షెడ్లపూర్తిగా నిర్మించిన తర్వాత సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయబోతున్నారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు పట్టుదలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఖమ్మం మిర్చిమార్కెట్ ఆవశ్యత గురించి వివరించి నిధులు మంజూరు చేయించారు.

గాలికుంటు వ్యాధి నిర్మూలనే లక్ష్యం


గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జేడీ

- సంవత్సరానికి రెండు సార్లు ఉచితంగా టీకాలు
- టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి...
- పశు సంవర్ధక శాఖ జేడీ బోడెపూడి

నేలకొండపల్లి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో పశు సంవర్ధక శాఖ కృషి చేస్తోందని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బోడెపూడి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలో ఈనెల 15నుంచి ప్రారంభమైన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజేశ్వరపురం, మంగ్రాజుపల్లి, అజయ్‌తండా, చెర్వుమాధారం గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ బోడెపూడి పరిశీలించారు. రైతులతో పశువుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం జేడి డాక్టర్ బోడెపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో గాలికుంటు వ్యాధి కనబడకుండా చేయటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 3.35లక్షల పశువులుండగా.. 3.25 లక్షల డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే 35శాతం టీకాలు పశువులకు వేశారని నవంబరు 14 వరకు గాలికుంటు వ్యాదుల టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పశు వైద్య సిబ్బందితో పాటుగా, గోపాలమిత్రలు సైతం గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తారని డాక్టర్ బోడెపూడి చెప్పారు. సూడి పశువులు, చిన్న,చిన్న దూడలకు టీకాలు వేయరన్నారు. టీకాలను సంవత్సరానికి రెండు సార్లు ఉచితంగా వేస్తారన్నారు. ఇప్పటికే గాలికుంటు వ్యాధి కనపడటం లేదని, భవిష్యత్తులో అసలు కనపడకుండా చేస్తామన్నారు. జిల్లాను గాలి కుంటు వ్యాధి రహిత జిల్లాగా మారుస్తామని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ బోడెపూడి శ్రీనివాసరావు కోరారు. అక్టోబరు 15 నుంచి నవంబరు14 వరకు నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను అన్ని గ్రామాల్లో పశు సిబ్బంది వేస్తారని పశువుల పెంపకందారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేడి బోడిపూడి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో నేలకొండపల్లి ఏడి డాక్టర్ రావి శ్రీనివాసరావు, రాజేశ్వరపురం వైద్యుడు డాక్టర్ భువనేష్‌కుమార్, విశాలాక్షి, సిబ్బంది మురళి, రవి గోపాలమిత్రలు తాజ్‌పాషా, నరేష్, నాగరాజు, పాండురంగారావు పాల్గొన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భార్యను హతమార్చిన భర్త

తమను వదిలేసి వేరొకరితో వెళ్లిపోయిందన్న కోపంతో హత్య
ఏన్కూరు మండలం కాలనీనాచారంలో ఘటన

ఏన్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తనను, ముగ్గురు పిల్లలను వదిలి వేరేవ్యక్తితో వెళ్లిపోయిందన్న కోపంతో భర్త గొడ్డలితో భార్యను హతమార్చిన సంఘటన ఏన్కూరు మండలం కాలనీనాచారం గ్రామంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. కాలనీనాచారం గ్రామానికి చెందిన తాటి రామారావుకు అదే గ్రామానికి చెందిన వర్దని(32)తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం కాగా ఒక కూతురు, ఇద్దరు కుమారులు జన్మించారు. కుమార్తె ఆళ్లపల్లి కస్తూర్బాలో తొమ్మిదో తరగతి చదువుతుండగా, కుమారుల్లో ఒకరు కిన్నెరసాని గురుకులంలో 8వతరగతి, మరొకరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వతరగతి చదువుతున్నారు. సవ్యంగా సాగుతున్న ఆ కుటుంబంలో ఏడాది నుంచి కలహాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో వర్దనికి తమ గ్రామానికి చెందిన అఖిల్‌తో సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఏడాదిక్రితం భర్త, పిల్లలను వదిలేసి అఖిల్‌తో కలిసి విజయవాడ వెళ్లి అతనితో సహజీవనం సాగించింది. ఆ తర్వాత పెద్దమనుషులు, గ్రామస్థుల సమక్షంలో పంచాయతీ చేసి హెచ్చరించారు. ఆతర్వాత కొంతకాలం వర్దని భర్తతో ఉన్నా మార్పు రాలేదు. మళ్లీ ఆరునెలలుగా అఖిల్‌తో సత్తుపల్లి సమీపంలో సహజీవనం సాగిస్తోంది. ఈక్రమంలో ఈనెల 22న బుధవారం ఆళ్లపల్లిలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు అఖిల్‌తో కలిసి కస్తూర్బా పాఠశాలకు వెళ్లింది. విషయం తెలుసుకున్న భర్త రామారావు అక్కడకు వెళ్లి అఖిల్‌తో గొడవపడ్డాడు. అఖిల్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కుని భార్య వర్దనిని తీసుకుని కాలనీ నాచారం వచ్చాడు. ఇక నుంచి ఇద్దరం కలిసి ఉందామని, పిల్లలు పెద్దవారవుతున్నారని నచ్చజెప్పాడు. నిరాకరించిన ఆమె అప్పటికే రాత్రవడంతో అక్కడే ఉంది. ఇక గురువారం కూడా భర్త ఇంటి వద్దే ఉన్న వర్దని ఇంటి ఆరుబయట నిద్రించింది. అప్పటికే భార్యపై కోపం పెంచుకున్న రామారావు శుక్రవారం తెల్లవారుజామున గొడ్డలితో వర్దని తల, ముఖంపై నరకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నారబోయిన సంధ్య పరిశీలించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వర్దని తల్లి ముక్తి రాధమ్మ ఫిర్యాదు మేరకు రామారావుపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.


స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్‌ను అభినందిస్తున్న కలెక్టర్

స్నేక్ రెస్క్యూ చేయడం గొప్ప విషయం

రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్‌ను అభినందించిన కలెక్టర్ జితేష్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఓ సర్పం కనిపించడంతో సిబ్బంది ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునిసిపల్ కార్పొరేషన్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న సంతోష్ సురక్షితంగా పామును పట్టి బంధించాడు. కలెక్టర్ జితేష్ వి పాటిల్.. సంతోష్‌ను అభినందించి ప్రాణాధార ట్రస్ట్ , స్నేక్ రెస్క్యూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్నేక్ రెస్క్యూ రక్షణ పరికరాలకు అవసరమైన సహకారం అందిస్తానని అదేవిధంగా జిల్లా కేంద్రంలో స్నేక్‌రెస్క్యూ ప్రదర్శనశాల ఏర్పాటు చేస్తే ప్రజలకు విషపూరిత, విష రహిత, అరుదైన సర్పాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు.

ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలి : భద్రాద్రి కలెక్టర్

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకునేలా అదర్శవంతంగా తీర్చిదిద్దాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పా టిల్ సూచించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ గ్రామపంచాయతీలోని అంగన్ వాడీకేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. చిన్నారుల హాజరు శాతం, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యాభ్యాసం తదితర అంశాలు, వాటి అమలు విధానాలను కలెక్టర్ సమీక్షించారు. కేంద్రలోని చిన్నారులతో ముచ్చటించారు. సకాలంలో పిల్లలకు పోషకాహారం అందజేయాలని ఆదేశించారు.

కర్నూలు బస్సు ప్రమాదంలో.. వల్లభి యువకుడి దుర్మరణం

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. శ్రీనివాసరావు వల్లభి ఐవోబీ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్నాడు. సుమారు నాలుగేళ్ల క్రితం కుమారుడు, కుమార్తె ఉన్నత చదువుల నిమిత్తం విజయలక్ష్మీ హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో మేఘనాథ్ చదువు పూర్తయి బెంగళూరుకు చెందిన ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొంది ఏడు నెలలుగా అక్కడే ఉంటున్నాడు. దాంతో విజయలక్ష్మి కుమార్తెను చదివించుకుంటూ హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. అయితే దీపావళి పండుగ సెలవులకు మేఘనాథ్ హైదరాబాద్ వచ్చి కుటుంబసభ్యులతో సరదాగా గడిపాడు. బాణసంచా కాల్చి ఆనందం పంచుకున్నాడు. ఆ తర్వాత విధులకు హాజరయ్యేందుకు గాను గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ఓ ట్రావెల్స్ బస్సులో వెళ్తుండగా అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మేఘనాథ్ కాలి బూడిదయ్యాడు. తెల్లవారేసరికి ఈ విషయం తెలుసుకున్న మేఘనాథ్ తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికి అందివచ్చిన కుమారుడు.. ఎన్నో ఆశలతో ఉద్యోగ జీవితాన్ని ఆరంభించాడని, కానీ అంతలోనే విధి ఇలా బలితీసుకుంటుందనుకోలేదని వారు రోదించారు. మేఘనాథ్ మృతితో వల్లభిలో విషాద ఛాయలు అలుముకోగా.. మేఘనాథ్ మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారని, స్వగ్రామంలోనే అంత్యక్రియలు పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది.

అద్దాలు బద్దలు కొట్టుకుని బయటకొచ్చాడు..

సత్తుపల్లి పట్టణంలోని రఘురామ్ ఆసుపత్రి రోడ్‌లో నివాసం ఉంటున్న మన్నేపల్లి రవి, కుసుమ దంపతుల ఏకైక కుమారుడు సత్యనారాయణ అలియాస్ పండు హైదరాబాద్‌లోని సైనిక్‌పురిలో నివాసం ఉంటూ డీఆర్‌డీవోలో సెక్యూరిటీ సిస్టమ్స్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆఫీసు పని నిమిత్తం బెంగళూరు వెళ్లేందుకు 23న రాత్రి గండిమైసమ్మ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఎక్కి అప్పర్‌బెర్త్‌లో పడుకున్నాడు. తెల్లవారుజామున 3గంటల సమయంలో కర్నూలు జిల్లాలో అగ్ని ప్రమాదానికి గురైంది.

సత్యనారాయణ, మరికొందరు ప్రధాన ద్వారం నుంచి బయటకొచ్చేందుకు ప్రయత్నించినా అది తెరుచుకోకపోవడంతో బస్సు వెనుక అద్దాలను పగలగొట్టి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అయినా అప్పటికే సత్యనారాయణ కాలికి చిన్న ఫ్రాక్చర్ కాగా.. ఆయన సెల్‌ఫోన్ బస్సులోనే పడి మంటల్లో కాలిపోయింది. ఈ పెద్ద ప్రమాదం గురించి తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు తొలుత ఆందోళన చెందినా.. సత్యనారాయణ వేరొకరి ఫోన్ నుంచి తాను ప్రాణాలతో బయటపడినట్టు సమాచారం చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.


కుమారుడు సత్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడుతున్న తండ్రి రవి

ఐదు నిమిషాల్లో అంతా అయిపోయింది :

మన్నేపల్లి సత్యనారాయణ

నేను హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళదామని బస్సెక్కి అప్పర్‌బెర్త్‌లో పడుకున్నా. అందరూ నిద్రపోతున్న సమయంలో పెద్ద శబ్దం రావడంతో లేచి చూసేసరికి బస్సులో పల పొగ కమ్మేసింది. తొలుత ఏమీ అర్థం కాలేదు. డ్రైవర్ బస్సును ఆపి పక్కకు వెళ్లిపోయాడు. కిందికి దిగేందుకు మెయిన్ డోర్ వద్దకు రాగానే తెరచుకోకపోవడంతో మరో ఇద్దరితో కలిసి బస్సు వెనక అద్దాలు పగులకొట్టుకుని బయటపడ్డాం. అప్పటికే బస్సు మొత్తం మంటలు, పొగ వ్యాపించడంతో ఏమీ కనిపించడంలేదు. దాంతో కొందరు బయటకు రాలేకపోయారు. డ్రైవర్ కిందికి దిగి వెళ్లేముందు ప్రధాన ద్వారం తెరిచి ఉంటే అందరూ బతికేవాళ్లు. ఐదు నిమిషాల్లో అంతా అయిపోయింది. కొందరం బయటపడ్డా.. చాలా మంది దహనం కావడం బాధేసింది.

ఈనెల 30లోపు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి : డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పదోతరగతి, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలు 2026 మార్చిలో నిర్వహించే పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో నవంబరు 15 లోగా, రూ. 200ల ఆలస్య రుసుంతో డిసెంబరు 2లోగా, రూ.500ల ఆలస్య రుసుంతో డిసెంబరు 15 లోగా ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు.

డీజీపీకి వినతిపత్రం అందించిన బీజేపీ నాయకులు



డీజీపీని కలిసి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం బైపాస్‌రోడ్/సత్తుపల్లిరూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ప్రజల భద్రత, సామాజిక న్యాయం జరుగుతున్న అక్రమాలపై బీజేపీ జిల్లా నాయకత్వం డీజీపీని కలిసి శుక్రవారం హైదరాబదులో బీజేపీ జాతీయ నాయకులు, కర్ణాటక తమిళనాడు రాష్ట్రల కో ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరావు, పలువరు బీజేపీ నాయకలు కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 18న సత్తుపల్లిలో జరిగిన బీసీ బంద్ సందర్భంగా కాంగ్రెస్ నేతలు కమల్‌పాషా తదితరులు బీజేపీ నాయకులు, కార్యకర్తలపై కొందరు దాడికి పాల్పడ్డారని వారిపై చట్టపరంగా తీసుకోవాలని అదేవిధంగా ఖమ్మం, ఏపీ సరిహద్దు ప్రాంతంలో గోవుల అక్రమరవాణ నిరంతరం కొనసాగుతుందని, దీనిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న గోరక్షకులు బెదిరింపులకు గురవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు పొంగులేటి సుధాకరరెడ్డి తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి దేవీకి వాసుదేవరావు, ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ.రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ఖమ్మంఅర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా టి.సంతోష్, ఏ.గోపీచంద్‌ను ఎన్నుకున్నారు. ఖమ్మంలో జరిగిన పీడీఎస్‌యూ జిల్లా 22వమహాసభ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.సాంబ నూతన కమిటీని శుక్రవారం ప్రకటించారు. కోశాధికారిగా టి.రాజేష్, కార్యవర్గ సభ్యులుగా లోకేష్, మనోహర్, కె.చందును ఎన్నుకున్నారు.

29న కాశీలో భద్రాద్రి రామయ్య కల్యాణం

నేడు తరలివెళ్లనున్న వైదిక అధికారుల బృందం

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

స్వర్ణకవచాలతో దర్శనమిచ్చిన రామయ్య

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న విశాఖపట్నం ఎమ్మెల్యే



భద్రాద్రి రామాలయంలో కుటుంబ సభ్యులతో విశాఖపట్నం ఎమ్మెల్యే

భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామయ్య కల్యాణాన్ని ఈ నెల 29న కాశీలో నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులను అనుసరించి హిందూ ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన శ్రీ పరాశర వైదిక ఆగమశాస్త్ర వేదపరిషత్ కోరిక మేరకు ఈ నెల 29న రామయ్య కల్యాణాన్ని కాశీలో(వారణాసి క్షేత్రంలో) జరపనున్నారు. ఈ క్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబాతో పాటు వైదిక పరిపాలన సిబ్బంది 12 మంది శనివారం కాశీకి వెళ్లనున్నారు.

రామయ్యను దర్శించిన విశాఖపట్నం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఏపీలోని విశాఖపట్నం ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొనగా.. వైదిక సిబ్బంది వేద ఆశీర్వచనం అందజేయడంతో పాటు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, బిక్షంగౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు ధనికొండ శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు బెక్కంటి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు పూనెం నర్సయ్య, అసోసియేట్ అధ్యక్షుడు భాస్కర్, పటేల్‌లుసైతం రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శుక్రవారాన్ని పురస్కరించుకొని స్వామివారు స్వర్ణ కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఇదిలా ఉండగా.. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక చిత్రకూట మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించనున్నారు. రూ.500 రుసుం దేవస్థానానికి చెల్లించాల్సి ఉండగా.. వ్రత సామగ్రి దేవస్థానమే అందజేస్తుంది. ఉభయదాతలకు స్వామి వారి అన్నప్రసాద సౌకర్యం లభిస్తుంది.

నేటి నాగుల చవితికి ప్రత్యేక ఏర్పాట్లు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని ఘనంగా నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. శనివారం పుట్టల వద్ద పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏటా కార్తీక శుక్లపక్ష బహుళ చవితి నాడు నాగుల చవితిని జరుపుతారు. ధర్మసింధు గ్రంథం ప్రకారం సూర్యోదయానికి తిథి లేదా నక్షత్రం ఉంటే ఆ పండగను ఆ రోజు జరుపుకోవడం ఆచారం. కాగా ఉదయానికి చవితి తిథి ఉండడంతో శనివారమే నాగులచవితిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం పురోహితులు నిర్ణయించిన ప్రకారం ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల లోగా పుట్టల వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లి పూజలు చేసేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. శుక్రవారం జిల్లాలో మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పూజాసామగ్రి, పూలు, పండ్లు, నాటుకోడి గుడ్ల ధరలు అమాంతం పెరిగాయి. నగరంలోని పలు ఆలయాల్లోని నాగేంద్రస్వామి ఆలయాల్లో నాగులచవితి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. భక్తులు ఉపవాసం ఉండి నాగేంద్రుడికి పాలు, ప్రసాదాలు సమర్పిస్తారు. రాత్రి జాగారం చేసి ఆదివారం తెల్లవారుజామున సద్దిపాలు పోసి ఉపవాస దీక్షలు విరమిస్తారు.

రామాలయ ఘటనపై పోలీసు నిఘా వర్గాల ఆరా

భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : భద్రచలంలోని శ్రీ సీతారామచంద్రరస్వామి వారి ఆలయంలో ఎస్‌పీఎఫ్ సిబ్బందితో దేవస్థానంలోని కీలక అధికారులతో ఇటీవల కాలంలో చురుగ్గా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి వాగ్వివాదంకు దిగిన ఘటనపై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. గురువారం మధ్యాహ్నం ఆలయం తలుపులు మూసే సమయంలో చోటు చేసుకున్న ఈ ఘటన దేవస్థానం వర్గాలతో పాటు రామ భక్తుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో పోలీసు నిఘా వర్గాలు ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి పోలీసు నిఘా ఉన్నతాధికారులకు పంపినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో ఎస్‌పీఎఫ్ సిబ్బంది సైతం ఈ విషయాన్ని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దృష్టికి తీసుకొచ్చారు.

భద్రాద్రి జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా సంపత్‌కుమార్



సంపత్‌కుమార్‌కు డీఎస్‌వో నియామక పత్రాన్ని అందిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జిల్లా సైన్స్ ఆఫీసర్ పోస్టుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జూలూరుపాడు మండలానికి చెందిన కాకర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బి.సంపత్‌కుమార్‌ను జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మీ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ పోస్టు కోసం మొత్తం ముగ్గురు ప్రధాన ఉపాధ్యాయులు, ఇద్దరు సైన్స్ టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో పని చేసిన డీఈవో సైన్స్ ఆఫీసర్ పోస్టు భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. దరఖాస్తులు అన్నీ పరిశీలించిన తర్వాత... వీరిలో ఒకరిని ఎంపిక చేసి ఫైలు ఉన్నతాధికారుల అనుమతి కోసం పంపించడం జరిగింది. ఈ విషయంలో ముగ్గురు ప్రజా ప్రతినిధులు తమ అభ్యర్థుల కోసం రికమండేషన్స్ చేయడం జరిగింది. సైన్స్ ఆఫీసర్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, తదితరులు డిమాండ్ చేశారు. దీంతో మూడు నెలలపాటు సైన్స్ ఆఫీసర్ పోస్టు భర్తీ పెండింగ్‌లో ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి, డీఎస్‌వో పోస్టు భర్తీ కాకుండా కొంత కాలం పాటు అడ్డుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. రాజకీయ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు తదితరుల ఒత్తిడితోనే డీఎస్‌వో పోస్టు ఎట్టకేలకు భర్తీ చేశారు. జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా ఎంపికైన డి.సంపత్ కుమార్ గతంలో ఎస్సీఎస్సీ కో ఆర్డినేటర్, ఎన్జీసీ అకాడమిక్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. గతంలో జరిగిన అనేక సైన్స్ ఫెయిర్ కార్యక్రమాల్లో కూడా ఆయన పాల్గొన్నారు. జాతీయ సైన్స్ కాంగ్రెస్‌తో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవ సందేశాన్ని ఇంటింటికీ చేర్చాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సీపీఐలో చేరుతున్న పలువురికి కండువాలు కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం అర్బన్ అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల ఘనచరిత్ర నేటితరానికి తెలియజేయటంతో పాటు భవిష్యత్ పోరాటాలకు కార్యోన్ముఖులను చేసే విధంగా సీపీఐ నూరేళ్ల ఉత్సవ సందేశాన్ని ఇంటింటికీ చేరవేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రఘునాధపాలెం మండల సీపీఐ సమితి సమవేశం మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కాలంలో చేసిన త్యాగాలు, జరిపిన పోరాటాలు మననం చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారతదేశ చరిత్రలో అధికారం లేకుండా వందేళ్లప్రజల పక్షాన పోరాడిన ఏకైక రాజకీయపార్టీ సీపీఐ అన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఆ తరువాత అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సీపీఐది అన్నారు. కాంగ్రెస్ బ్రిటీష్ వారితో లాలూచీ పడుతున్న దశలో సంపూర్ణ స్వాతంత్రానికి పిలుపునిచ్చింది కమ్యూనిస్టులు మాత్రమే అన్నారు. స్వాతంత్ర పోరాటంలో కనీస ఊసులేని బీజేపీ దేశం కోసం ప్రాణాలు అర్పించిన కమ్యూనిస్టులను తక్కువగా అంచనా వేయటం విడ్డూరంగా ఉందన్నారు. దున్నేవానికి భూమి దక్కాలని పోరాటం చేసిన ఘనత సీపీఐది అన్నారు. బ్యాంకుల జాతీయ కరణ, రాజభరణాలరద్దులాంటి అనేక సంస్కరణల వెనుక కమ్యూనిస్టు పోరాటాలు దాగి ఉన్నాయన్నారు. సీపీఐ శతాబ్దిఉత్సవాలకు పోరాటాల పురిటిగడ్డ ఖమ్మం వేదిక కావటం అభినందనీయంఅన్నారు. ప్రపంచంలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేకత ఉందన్నారు. అటువంటి సువర్ణలిఖిత పోరాటంలో ఖమ్మంజిల్ల కీలక భూమిక పోషించిందన్నారు. డిసెంబర్ 26న జరిగే శతాబ్ది ముగింపు సభకు లక్షలాది మంది హాజరయ్యేలా సీపీఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా సీపీఐలో చేరిన పలువురికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కే జానిమియా, కొండపర్తి గోవిందరావు, మహ్మద్‌సలాం, శింగు నరసింహారావు, పోటు కళావతి, సీహెచ్ సీతామహాలక్ష్మి, తాటి వెంకటేశ్వరావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు నాన బలరామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో పంటల సాగు

శాస్త్రవేత్త డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

కృషివాస్ యాప్‌పై రైతులకు అవగాహన



శాస్త్రవేత్తలు, అధికారులతో రైతులు

దమ్మపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటల సాగుకు ఏఐ టెక్నాలజీని శాటిలైట్‌తో అనుసంధానం చేసి రైతులకు మేలు జరిగేలా కృషివాస్ యాప్ ద్వారా కృషి చేస్తున్న ట్లు సంస్థ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం దమ్మపేటలోని రైతు వేదికలో 'కృషి వాస్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దమ్మపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి కృషివాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడు తూ.. రైతులు సాగు చేసే పంటల్లో వచ్చే తెగుళ్లు, పోషక లోపాలను గుర్తించేందుకు శాటిలైట్‌కు ఏఐ టెక్నాలజీ ద్వారా కృషి యాప్‌ను అనుసంధానం చేస్తామన్నారు. దీని వల్ల రైతుల కంటికి కనిపించని తెగుళ్లను, పంటలలో పోషకాహార లోపాలను గుర్తించడం జరుగుతుంద న్నారు. తద్వారా రైతులకు పంటల సాగుకు లాభం చేకూర్చే విధంగా నివారణ చర్యలను యాప్ ద్వారా సూచించడం జరుగుతుందన్నారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పామాయిల్ సాగులో రైతులకు కృషివాస్ యాప్ ఉపయోగ పడుతుందన్నారు. పామాయిల్ పంటలో తెగుళ్ల సమస్య, పోషకాల సమస్యను గుర్తించి నివారించడానికి ఉపయోగకరంగా ఉంటుదన్నారు. ఆత్మ కమిటీ ఛైర్మన్ సుంకవల్లి వీరభద్రరరావు మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీ ద్వారా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పంటలను లాభదాయకంగా సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవోలు కేశవరావు, దీప్తి, అనుబాబు, వినోద్, రైతులు పాల్గొన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా

దమ్మపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ఒక మహిళను దూషించిన కేసులో ముగ్గురు వ్యక్తులకు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ దమ్మపేట జుడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి జస్టిస్ బొమ్మాతి భవాని శుక్రవారం తీర్పు ఇచ్చారు. దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన మారుతి సీతారాములు, రావుల రఘురాం, మారుతి వెంకటేష్ అనే వ్యక్తులు దూషిస్తూ వేధించడంతో కేసు నమోదయినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి విచారణ చేసి నేరం రుజువు కావడంతో ముగ్గురు నిందితులకు రెండు సంవత్సరాల ఏడు నెలల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరి రూ.1000 జరిమానాను విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈసందర్భంగా దర్యాప్తు అధికారి ఎస్ఐ జలకం ప్రవీణ్, పీసీ రాంబాబు అభినందించారు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు



వివరాలను తెలుపుతున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రంగా గంజాయి ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి సేవిస్తున్న ఐదుగురి నిందితులను టేకులపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. టేకులపల్లి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వివరాలను వెల్లడించారు. టేకులపల్లికి చెందిన బానోతు కుమార్, తేజావత్ అనిల్, జాటోత్ శివ, గుగులోతు సాయి, గుగులోతు వినాయక్‌లు శుక్రవారం మధ్యాహ్నం టేకులపల్లిలోని సమ్మక్క సారక్క గద్దెల వద్ద పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పారిపోతుండగా ఎస్సై రాజేందర్, సిబ్బంది పట్టుకొని వారిని విచారించారు. వారి వద్ద రూ.26,550 విలువ కలిగిన 531 గ్రాముల గంజాయి లభ్యమయింది. దీంతో వారి వద్ద నుంచి రూ.1500నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. ఈ సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై రాజేందర్, ఎవ్వరైనా గంజాయి సేవించినా, విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

జూలూరుపాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం జూలూరుపాడులోని సాయిబాబా ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. జూలూరుపాడుకు చెందిన భార్యాభర్తలు జోనబోయిన నవ్య, నరేందర్‌లు కలసి బంధువుల ఇంట్లో ఓ వేడుకలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై ఖమ్మం జిల్లా తల్లాడ వెళ్తున్నారు. ఈ క్రమంలో నవ్యకు కళ్లు తిరగడంతో ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయింది. ఈ సంఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మహిళను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

కేసు నమోదు

బూర్గంపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పాదచారురాలిని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనపై శుక్రవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండల పరిధిలోని గౌతమిపురంకు చెందిన నాగమణి అనే మహిళ ఏంఈవో కార్యలయంలో మేసెంజర్‌గా విధులు నిర్వహిస్తుంది. విధుల్లో భాగంగా శుక్రవారం ఉదయం కార్యలయాన్ని శుభ్రంచేసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో భద్రాచలం నుంచి కోరుట్ల వెళ్తున్న కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బూర్గంపాడు మార్కెట్ యార్డు సమీపంలో ఆమెను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగమణికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రురాలిని భద్రాచలంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతుంది. బాధిత మహిళ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు

దమ్మపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసారు. ఈఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముష్టిబండ గ్రామ సమీపంలో తోటలో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై సమాచారం మేరకు శుక్రవారం దమ్మపేట పోలీసులు దాడి చేసారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ 8050 స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

నాణ్యతా లోపమా... ప్రమాదమా..?

పడిపోయిన సెంట్రల్ లైటింగ్ పోల్

నాసిరకంగా ఉన్న నిర్మాణాలే కారణమా?

ఏదైనా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందా...



దమ్మపేటలో పడిపోయిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ పోల్

దమ్మపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట జయలక్ష్మీ థియేటర్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున సెంట్రల్ లైటింగ్ విద్యుత్ పోల్ ఒకటి కూలిపోయింది. ఈ ఘటనపై కొందరు నాసిరకంగా నిర్మాణం చేపట్టడం వల్లే కూలిపోయిందని... మరికొందరు ఏదో గుర్తుతెలియని వాహనం కొద్దిమేర తాకడం వల్ల కూలిపోయిందని వాదనలు వినిపిస్తున్నాయి. ఈఘటన ఏ విధంగా జరిగిందనే విషయంపై నిర్ధారించాల్సి ఉండగా అందుకు సంబంధించిన అధికారులు మాత్రం కనెత్తి కూడా చూడక పోవడం విశేషం. మందలపల్లి క్రాస్ రోడ్ నుంచి దమ్మపేట జయలక్ష్మీ థియేటర్ వరకు రూ.5 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి కాగా ప్రస్తుతం డివైడర్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈక్రమంలో సెంటల్ లైటింగ్ విద్యుత్ స్థంభం భూమిలోపల నుంచి నిర్మించినా కాంక్రీట్ దిమ్మెతో సహా స్థంభం పైకి లేచి పడిపోవటం చర్చనీయాంశంగా మారింది. గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టిన విధంగా లేక పోవటంతో సెంట్రల్ లైటింగ్ స్థంభం కూలిపోవడానికి కారణం నాసిరకం నిర్మాణం వల్లే జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ లైటింగ్ స్థంభం దిమ్మెల నిర్మాణం లోతు తక్కువగా, నాసిరకంగా నిర్మాణం చేపట్టడం వల్లే కూలిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నాసిరకం నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ప్రస్తుతం నిర్మిస్తున్న డివైడర్ పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని సంబంధిత అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉందని గ్రామస్థులు వాపోతున్నారు.

మధిర ఓఆర్ఆర్‌కు ఆమోదం

రూ.193కోట్లతో హ్యామ్ విధానంలో జరగునున్న రింగ్‌రోడ్డు నిర్మాణం

డివిజన్‌లో రూ.400కోట్లతో 32ప్యాకేజీల్లో రహదారుల పనులు

పట్టణంలో ట్రాఫిక్ కష్టాలకు మోక్షం



ఔటర్ రింగ్ రోడ్డుకు ఆత్కూర్ రెవెన్యూలో పెగ్ మార్కింగ్

మధిర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మధిరలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రణాళికలు త్వరలోనే కార్యరూపం దాల్చనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) విధానంలో ఈ రోడ్లు నిర్మించేందుకు నిర్ణయించింది. 32 ప్యాకేజీల కింద రూ.400 కోట్ల పనులు చేపట్టేందుకు ఆమోదం తెలపగా.. అందులో రూ.193.52 కోట్లతో మధిర ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎక్కువ మంది ఖమ్మం, వైరా నుంచి విజయవాడ వెళ్లాలంటే మధిర మీదుగానే ప్రయాణిస్తుంటారు. భారీ వాహనాలు సైతం టోల్‌గేట్లు లేకపోవడంతో విజయవాడ- హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. మధిరలో ట్రాఫిక్‌ను నివారించేందుకు విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా వెళ్లేలా అధికారులు గత జూలైలో సర్వే నిర్వహించి ఎలైన్ మెంట్ సిద్ధం చేశారు. మధిర మండలంలోని కృష్ణాపురం గ్రామానికి పాలవాగు మధ్యలో మధిర-వైరా ప్రధాన రహదారి నుంచి ఆత్కూరు, మాటూరు, మాటూరుపేట, నిధానపురం మీదుగా దెందుకూరు తరువాత ప్రస్తుతం ఉన్న మధిర నుంచి ఎర్రుపాలెం, కంచికచర్ల, విజయవాడ రోడ్డులో కలిపేలా నాలుగు వరసల్లో గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం 13 కి.మీ మేర రోడ్డు నిర్మించేందుకు 92 ఎకరాల భూసేకరణ అవసరం ఉంటుందని సర్వే పూర్తి చేసి ప్రతి పాదనలను ప్రభుత్వానికి అందజేయగా.. రోడ్డు మంజూరయ్యి హ్యామ్ విధానంలో నిర్మించేందుకు టెండర్లను కూడా పిలవనున్నారు. హ్యామ్ విధానంలో నిర్మాణాలకు అయ్యే ఖర్చును 40శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించి వెంటనే నిధులను విడుదల చేయనుండగా మిగతా 60శాతాన్ని టెండర్ దక్కించుకున్న ఏజెన్సీ ముందుగా భరించాల్సి ఉంటుంది. ఈ 60శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాల పాటు 11శాతం వడ్డీతో కలిపి ఇన్‌స్టాల్‌మెంట్‌గా సంబంధిత ఏజెన్సీకి చెల్లిస్తుంది.

ఈ హ్యామ్ విధానంలో మధిర డివిజన్‌లో నూతనంగా చేపట్టే మధిర ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణంతో పాటు గతంలో ఉన్న మధిర-ఎర్రుపాలెం, రాయపట్నం బ్రిడ్జి నుంచి మోటమర్రి రైల్వేస్టేషన్, ఖమ్మం-బోనకల్, మధిర- తూటికుంట్ల, జగ్గయ్యపేట-వైరా, మధిర- నందిగామ రోడ్లను విస్తరణ, వాటిని పటిష్ట పరిచే పనులను చేపట్టనున్నారు, మొదటి విడత కింద మధిర ఔటర్ రింగ్ రోడ్డు, మధిర-ఎర్రుపాలెం రోడ్డు మంజూరు కాగా రెండో విడతలో మిగతా పనులు చేపట్టనున్నారు.

కుమారుడు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

కూల్‌డ్రింక్‌లో కలుపు నివారణ మందు కలిపి తాగిన వైనం

ఇద్దరి పరిస్థితి విషమం.. ఖమ్మం ఆస్పత్రికి తరలింపు

కిందపడేసి ప్రాణాలు కాపాడుకున్న పెద్ద కుమారుడు

కుటుంబకలహాలే కారణం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఘటన



సత్తుపల్లి ఆసుపత్రిలో సల్మాకు చికిత్స చేస్తున్న వైద్యులు



చికిత్స పొందుతున్న చిన్నారి నయామ్

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తుపల్లి మండలంలోని కొమ్మేపల్లికి చెందిన పఠాన్ సల్మా, సలీమ్ దంపతులకు తొమ్మిదేళ్ల వయసున్న నసీమ్, ఆరేళ్ల వయసున్న నాయమ్ కుమారులున్నారు. సలీమ్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, 28ఏళ్ల సల్మా ప్రైవేట్ జాబ్ చేస్తూ స్థానిక ద్వారకాపూరి కాలనీలో నివాసం ఉంటున్నారు. కొన్నేళ్లపాటు సజావుగా సాగిన వారి కాపురంలో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో తరచూ గొడవలు జరుగుతుం డటంతో మనస్తాపానికి గురైన సల్మా తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇంట్లో భర్త లేని సమయం లో కూల్‌డ్రింక్‌లో కలుపు నివారణ మందు కలిపి ఇరువురు కుమారులకు ఇచ్చి తానూ తాగింది. అయితే పెద్ద కుమారుడు నసీమ్ తాగకుండా కిందపడేయగా.. చిన్న కొడుకు నాయామ్ ఆ కూల్‌డ్రింక్‌ను తాగాడు. సల్మా, నాయామ్ ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన సల్మా కుటుంబసభ్యులు ఆ ఇద్దరినీ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



1,2 తేదీల్లో పట్టణస్థాయి క్యారమ్స్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్‌అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాక్యారమ్స్ అసోసియేషన్ సహకారంతో నవంబరు 1,2 తేదీల్లో నగరంలోని కిన్నెరసాని థియేటర్ వద్ద గల టీఎన్‌జీవోస్ కాంప్లెక్స్‌లో పట్టణస్థాయి క్యారమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నీ నిర్వాహకులు ఉదయ్‌కిరణ్, సంజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నీలో సింగిల్స్ పోటీలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తామని చెప్పారు. డబుల్స్ ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 28కల్లా తమ ఎంట్రీలను 8125979975, 9848265403 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు.

నాలుగు నెలలుగా
డ్రెయినేజీలు శుభ్రం చేయలేదు

- జ్వరాలతో మంచానపడ్డాం
- మేయర్ ఎదుటనే పారిశుధ్య ఉద్యోగులను నిలదీసిన ప్రజలు
- 7వ డివిజన్‌లో మేయర్ నీరజ ఆకస్మిక తనిఖీ


మురుగు కాల్వను పరిశీలిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ వీధిలో మేయర్ పునుకొల్ల నీరజ పాదయాత్ర సందర్భంగా ఇళ్లలోని మహిళలు బయటకు వచ్చి మేయర్‌తో గోడు వెల్లబోసుకున్నారు. శుక్రవారం 7వ డివిజన్‌లోని ముదిరాజ్‌నగర్ వీధిలో మేయర్ పాదయాత్ర చేశారు. ప్రజలతో నేరుగా మాట్లాడారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు ఫిర్యాదుల చేశారు. నాల్గునెలల నుంచి మునిసిపాలిటీ సిబ్బంది తమ వీధిలోకి రాలేదని, జ్వరాలతో ఇంటిల్లపాది మంచానపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. మేయర్ రావటంతోనే పారిశుధ్య ఉద్యోగులు వీధిలోకి వచ్చారని,ఎన్నిసార్లు చెప్పిన ఇంతవరకు రాలేదని మహిళలు పెద్దఎత్తున ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీ శుభ్రం చేయక పోవటంతో దుర్వాసన వస్తుందని, కాల్వలో మనుషులు పడి కాళ్లు విరిగాయన్నారు. మిషన్ భగీరథ కోసం రహదారులను తవ్వివాటిని పూడ్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య సిబ్బంది చేయాల్సిన పనులను తామే చేసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రధాన రహదారులే కాకుండా అంతర్గత రహదారులపైన దృష్టి పెట్టాలని సూచించారు. పారిశుధ్యలోపంతో పాటుగా డ్రెయినేజీల్లో రాళ్లు, వ్యర్థాలు పడి ఉండటాన్ని గుర్తించారు.అంతర్గత రహదారులు ధ్వంసమై ఉండటంతో మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని సంబంధిత అధికారులను మేయర్ ప్రశ్నించారు. రెగ్యూలర్‌గా పారిశుధ్య పనులు చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, విలీన ప్రాంతాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు తనకు సమస్యలు తెలియజేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

ఉపాధిహామీలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు

అడిషనల్ డీఆర్‌డీవో శిరీష

కూసుమంచి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీఆర్‌డీవో శిరీష హెచ్చరించారు. శుక్రవారం కూసుమంచిలోని ఎంపీడీవో కార్యాలయంలో 16వవిడత సామాజిక తనిఖీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కొందరు ఫీల్డ్‌అస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడం, మస్టర్లలో కొట్టివేతలు, దిద్దడం, హాజరు కూడికల తప్పులు, కూలీల సంతకాలు లేకపోవడం వంటి తప్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వృత్తి నిర్వహణలో సంవత్సరాలు గడుస్తున్నా తప్పులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైన సక్రమంగా విధులు నిర్వహిస్తు కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. పలువురు ఎఫ్ఏలకు రూ.లక్షా 35వేలు పెనాల్టీలు వేశారు. రూ.లక్షా 85వేలు రికవరీ చేశారు. కార్యక్రమంలో డీపీవో సక్రియ, సీనియర్ క్యాసీ అధికారి వీరయ్య, అంబుడ్స్‌మెన్ రమేష్, ఖమ్మం క్లస్టర్ ఏపీడీ శ్రీదేవి, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ పవన్, సూపరిండెంట్ శాస్త్రి, పీఆర్ ఏఈ రైన్‌హార్డ్, ఏపీవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తీగల వంతెన పనులను వేగిరం చేయాలి

- మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు నాణ్యతగా ఉండాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- భూ నిర్వాసితుల వెంచర్ అభివృద్ధి పనులపై సమీక్ష


పనుల మ్యాపులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కాల్వొడ్డు తీగల వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం నగరంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్‌నిర్మాణం, కాల్వొడ్డుతీగల వంతెన పనులు, మున్నేరు భూనిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ వెంచర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు ఇచ్చే ప్రత్యామ్నాయ భూమి లేఔట్ అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు.నిపుణుల కమిటీ చేసిన డిజైన్ ప్రకారం రిటైనింగ్‌వాల్ నిర్మాణం పక్కాగా జరగాలన్నారు. పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి రిటైనింగ్ వాల్ భూనిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం రైతులకు, నిర్వాసితులకు అందించే 125 ఎకరాల ప్రత్యామ్నాయ భూముల లేఔట్ వెంచర్ అభివృద్ధి పనులు వేగిరం చేయాలన్నారు. మున్నేరుపై నిర్మించే కేబుల్‌బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, నిర్ణీత గడుపు లోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వచ్చే విధంగా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. తీగల వంతెన నిర్మాణం వల్ల ఎవరు కూడా నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ ఎస్ఈ యాకుబ్, ఈఈ పవార్, ఆర్డీఓ నరసింహారావు, ఇరిగేషన్ డీఈ రమేష్‌రెడ్డి, ఖమ్మంఅర్బన్,రూరల్ మండల తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లో రావాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు జిలుకర రవికుమార్ పిలుపునిచ్చారు . శుక్రవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నిజిల్లాల్లో ప్రజలను చైతన్యం చేసేందుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం యువతకు కలిపిస్తున్నామని పేర్కొన్నారు. యువత రాజకీయచైతన్యం కలిగినప్పుడే ఈసమాజం మరింత ముందుకు వెళుతుందన్నారు. ఈసమావేశంలో పార్టీ స్టార్‌కాంపెయినర్, ఐఏఎస్ రిటైర్డు అధికారి కోనప్పరెడ్డి హరిప్రసాద్, స్టీవెన్, మేకల సారయ్య, చెరుకూరి రత్నరాజు, జానుప్రభాకర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

కామేపల్లి, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి హమీ కూలీల వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం జాస్తిపల్లిలో వ్యవసాయ కార్మిక గ్రామకమిటీ ఏర్పాటు చేసిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో కూలీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు 16 రకాల వస్తువులను పంపిణీ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి బాదావత్ శ్రీను,వ్యవసాయ కార్మిక సంఘంమండల కార్యదర్శి ఆమంచి అంజయ్య, రైతుసంఘం నాయకులు రాయల సత్యనారాయణ,అజయ్, పాపమ్మ జ్యోతి, రాజేశ్వరి, జయమ్మ, నీలమ్మ పద్మ రాధ, సునీత పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఎస్సీకాలనీలో
పారిశుధ్యం అధ్వానం

నేలకొండపల్లి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. మురుగు కాల్వలు చెత్త, చెదారంతో నిండిపోయాయి.ఎక్కడ నీళ్ళు అక్కడే ఆగిపోతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్న పరిస్థితుల నేపధ్యంలో పంచాయతీ సిబ్బంది గానీ గ్రామ ప్రత్యేకాధికారి అస్సలు పట్టించుకోవటం లేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కాలనీలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రైల్వేలైన్ భూ నిర్వాసితులకు
మార్కెట్ రేటు చెల్లించాలి


స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరికి వినతిపత్రం అందచేస్తున్న నిర్వాసితులు

కారేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-భద్రాచలం రోడ్ రైల్వేలైన్ డబ్లింగ్ పనుల్లో వ్యవసాయభూములు, సొంత ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు అధికారులు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతూ భూ సేకరణ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ రాజేశ్వరికి భూ నిర్వాసితులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైల్వే లైన్ డబ్లింగ్ భూ నిర్వాసితులతోగ్రామసభ నిర్వహించా రు. ఈ సభకు స్పెషల్‌డిప్యూటి కలెక్టర్ రాజేశ్వరి పాల్గొని భూ సేకరణకు సంబంధించిన నిబంధనలను వెల్లడించారు. నిర్వాసితులు ఇచ్చిన విన్నపాలను కూడా ఉన్నతాధికారులకు వివరిస్తానన్నారు. గ్రామసభలో పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ.. సింగరేణి రెవెన్యూ గ్రామం నాన్ ఏజెన్సీ కాబట్టి వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.91లక్షలు, ఇళ్లు కోల్పోతున్నవారికి గజానికి రూ.20వేల చొప్పున మార్కెట్ రేటు చెల్లించాలని కోరారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మార్కెట్ వ్యాల్యూ చూసినా భూమికి అధికంగా ధరపలుకుతుందని, దాని ప్రకారం చెల్లించాలని కోరారు. గ్రామసభలో తహసీల్దార్ రమేష్, రైల్వే జేఈ శ్రీకాంత్,ఏవో అశోక్,సర్వేయర్ కిరణ్ పాల్గొన్నారు. కాగా ఈ గ్రామ సభను నేటికి వాయిదా వేశారు.

ప్రియదర్శిని కళాశాలలో వర్క్‌షాప్

ఖమ్మంరూరల్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధిపై ఐదురోజుల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్, మెషిన్ లెర్నింగ్ వర్క్‌షాపును శుక్రవారం కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ ప్రారంభించారు.ఈశిక్షణ కార్యక్రమాలతో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలుగు తుందన్నారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.గోపాల్, రిసోర్స్ పర్సన్‌సయ్యద్ రిజ్వాన్,అకాడమి డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ పాల్గొన్నారు.

29న కార్పొరేషన్ ఎదుట ధర్నా

ఖమ్మంఅర్బన్ అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగర సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఈనెల 29న జరిపే ధర్నాను జయప్రద చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వైరా రోడ్‌లోని సీపీఎం హవేలి కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈసమావేశంలో హవేలి పార్టీ మండల కార్యదర్శి దొంగల తిరుపతి రావు, జిల్లా కమిటీ సభ్యులు పి. రమ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోనిపిండిప్రోలులో ఆసంఘం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కళాశాలలో సుమారు 350మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈసమావేశంలో అజయ్, సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహాలను పోలీసులు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. ఇప్పటివరకు మృతదేహాల కొరకు ఎవరూ రానందున పోలీసుల సమక్షంలో బల్లేపల్లి వైకుంఠ ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ విద్యార్థికి ఆర్థిక చేయూత



ఖమ్మంఖానాపురం, హవేలి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అప్పికట్ల సాయికిరణ్‌కు ఆర్థికంగా చేయూతను అందించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గత ఫిబ్రవరిలో జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన అప్పికట్ల బాలకృష్ణ వ్యవసాయ పనులలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో సదరు విద్యార్థి చదువులకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా నేషనల్ ఇన్సురెన్స్ ద్వారా రూ.2లక్షల చెక్కును శుక్రవారం కళాశాలలో విద్యార్థికి అందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపల్ జి.రాజ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జె. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులు కుదేలు

- అధిక వర్షాలతో తీరని నష్టం
- పెట్టుబడులు రాని పరిస్థితి


నర్సింహులగూడెంలో వర్షాల కారణంగా నేలరాలుతున్న పత్తి

కూసుమంచి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కొద్దిరోజులుగా వర్షాలు ముమ్మరంగా కురుస్తున్నాయి. మరో రెండురోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచిస్తోంది. ప్రస్తుతం పత్తి చేతికొచ్చే దశ కావడంతో అన్నదాతలకు తీరని నష్టం చేకూర్చింది. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి చివరికి చేతికొస్తుందనుకున్న పంట ప్రస్తుతం కన్నీటి కడగళ్లను మిగులుస్తోంది. పూత, కాత దశలో కురిసిన వర్షాలకు పత్తికాయలు నల్లబడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తితీతకు వచ్చిన పత్తి నల్లబడుతోందిని, వర్షం కారణంగా కూలీలు రావడం లేదని వాపోతున్నారు. ఊటబారి పత్తిచేలు ఎర్రబారుతున్నాయని తెలిపారు. ఊట నీరు వస్తుందని వాపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.20వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుతం పెట్టుబడులు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. పాలేరు నియోజకవర్గంలో సుమారు 42వేల ఎకరాల్లో సాగుచేశారు. ప్రస్తుతం పత్తి తీసేందుకు సిద్ధమయ్యారు. నిత్యం వర్షం కురుస్తుండటంతో తీసేందుకు వీలుకాక నేలరాలిపోతోంది. ఈవిషయమై ఏవో వాణిని వివరణ కోరగా పత్తి చేలల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు కాల్వల ఏర్పాటు ద్వారా వర్షపునీటిని బయటకు వెల్లదీయాలని తెలిపారు.

వరిలో కంకినల్లి

వరిపొలాలు గింజపాలు పోసుకునే దశ నుంచి కోతదశలో ఉందని ఏవో వాణి తెలిపారు. ఈసమయంలో అక్కడక్కడ కంకి నల్లి ఆశించిందని నివారణకు స్పైరోమెసిఫిన్ లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున పిచుకారీ చేయాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణంలో కాటుక తెగులు ఆశించే అవకాశం ఉందని నివారణకు ప్రాపికొనజోల్ 1మి.లీ. నీటికి లేదా కార్బెండజిమ్ 50శాతం డబ్లుపీ మందును ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచుకారీ చేయాలని సూచించారు. మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు ఏవో తెలిపారు. వానాకాలం ధాన్యం విక్రయానికి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


గైగొళ్లపల్లిలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న ఏవో వాణి

కనీస వేతనాలు అమలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యద ర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతి పత్రం సమర్పించారు. పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగాకార్మికుల వేతనాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, కొయ్యల శ్రీనివాస్ , కిన్నెర నారాయణ, పార్దు, రఘు, సరస్వతి పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: ఏదులాపురం మునిసిపాలిటిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీయూసీఐ రాష్ట్రప్రధాన కార్యదర్శి జి.రామయ్య పేర్కొన్నారు. మునిసిపాలిటీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యాక్షుడు శ్రీనివాస్, గోసు పుల్లయ్య, రామదాసు, లెనిన్, మాధవరావు, ఆజాద్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- ఏడీసీపీ రామానుజం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఏడీసీపీ రామానుజం, ప్రసాదరావు, కుమారస్వామి

ఖమ్మంక్రైం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అదనపు డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా సిటీ ఆర్మ్డ్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఏడీసీపీలు ప్రసాదరావు, రామానుజం, కుమారస్వామి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విధి నిర్వాహణలో ఆదర్శంగా నిలిచిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూపోలీసుఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో రక్తదానం ద్వారా ప్రాణాలు కాపాడాలని ఉద్దేశంతో తలసీమియా చిన్నారులకుసంకల్ప స్వచ్ఛంద సంస్థ ద్వారా రక్తం అందించాలని శిబిరాన్ని ఏర్పాటుచేసినట్టు తెలిపారు. సుమారు 150 మంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. 32సార్లు రక్తదానం చేసిన ఎస్ఐ వేముల సుధాకర్‌రెడ్డిని అధికారులు అభినందించారు.ఈకార్యక్రమంలో ఏసీపీలు రమణమూర్తి,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఏఆర్ఏసీపీ సుశీల్‌సింగ్, నర్సయ్య, సీఐలు బాలకృష్ణ, భానుప్రకాష్, మోహన్‌బాబు, సత్యనారాయణ, ఉస్మాన్ షరీఫ్, రాజిరెడ్డి, ఆర్ఐలు కామారాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, డాక్టర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందిస్తున్న ఏడీసీపీలు


విద్యార్థిని కుటుంబానికి నగదు అందిస్తున్న హెచ్‌ఎం

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

కూసుమంచి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కూసుమంచి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గంధం నవ్య(14)అనే విద్యార్థిని అనారోగ్యంతో మృతిచెందింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాయల వీరాస్వామి, ఉపాధ్యాయులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. తల్లితండ్రులను ఓదార్చారు. పదివేల రూపాయలు అందించారు.

కార్పొరేటర్ల పారిశుధ్య బాట


46వ డివిజన్‌లో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వైష్ణవి ప్రసన్నకృష్ణ

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని కార్పొరేటర్లు పారిశుధ్యబాట పట్టారు.శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య పనులు దెగ్గరుండి చేయించారు. 46వ డివిజన్‌లో కార్పొరేటర్ కన్నం వైష్ణవి డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. నూతనంగా ప్రారంభమైన రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద ఉన్న వ్యర్థాలను తొలగించి వరద, మురుగు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, షేక్ రిజ్వీ, రామకృష్ణ, నర్సిరెడ్డి, మురళి, రాజనరేశ్ పాల్గొన్నారు. 44వ డివిజన్‌లోని వైరారోడ్డులో ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీల పూడిక తీత పనులు స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ ఆధ్వర్యంలో చేపట్టారు. జిల్లాకాంగ్రెస్ కార్యాలయం నుంచి పెట్రోల్‌బంకు వరకు ఉన్న ప్రధాన డ్రెయినేజీలోని వ్యర్థాలను తొలగించారు.పనులను మేయర్ పునుకొల్లు నీరజ తనిఖీలు చేశారు.కాంగ్రెస్ నాయకులు పాలేపు వెంకటరమణ, పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య, జవాన్ కుక్కల నాగరాజు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

ZONE

శనివారం 25 అక్టోబరు 2025

వైరా-మధిర

సత్తుపల్లి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

8

WYRA, MADHIRA, SATHUPALLY

అయ్యప్ప భక్తులకు రూ.50వేలు వితరణ



తల్లాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కిష్టాపురం గ్రామంలో అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం నిర్వాహణ కోసం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నారపోగు వెంకట్ రూ.50వేలు విరాళంగా అలందించారు. అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో శనివారం మహాపడిపూజ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రూ.50వేలు నగదును విరాళంగా శుక్రవారం భక్తబృందం సభ్యులకు అందించారు. అభిరామ ఐఏఎస్ అకాడమి చైర్మన్ విలాసాగరం అభిరామ్, వెంకటరావు, శ్రీను పాల్గొన్నారు.

వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి నిధుల మంజూరు

» ఎమ్మెల్యే వినతికి స్పందన



వైరా మునిసిపల్ కార్యాలయం

వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర మునిసిపల్ శాఖ రూ.15కోట్ల నిధులను మంజూరు చేసింది. రూ.15కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ నిర్వహించాల్సి ఉంది. రాష్ట్ర పురపాలకశాఖ సూచనల మేరకు స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ వైరా మునిసిపల్‌శాఖ అధికారులు, నాయకులతో సమీక్షించి రూ.15కోట్లతో పంపించిన ప్రతిపాదనలకు మంజూరు లభించింది. మునిసిపాలిటీలో అత్యంత కీలకమైన 9,12,13వార్డుల పరిధిలోకి వచ్చే కమ్మవారి కల్యాణ మండపం నుంచి కేవీసీఎం మీదుగా వెళ్లే సత్రంబజార్ రోడ్డు అభివృద్ధి, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.ఆరుకోట్లు, డంపింగ్‌యార్డుకు వెళ్లే సీసీ రోడ్డు కల్వర్టులు, డంపింగ్‌యార్డు నిర్మాణానికి రూ.4.75కోట్లు, పాత కూరగాయల మార్కెట్ షెడ్ల నిర్మాణానికి రూ.45లక్షలు, స్వచ్ఛ ఆటోలు, వాటర్ ట్యాంకు కొనుగోళ్లకు రూ.50లక్షలు, వైరాలో అదనపు కరెంట్ స్తంభాల ఏర్పాటు, ఎల్ఈడీ లైట్ల కొనుగోళ్లకు రూ.50లక్షలు, వైరాలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉన్న మధిర-జగ్గయ్యపేట వెళ్లే రోడ్డు సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై క్రాస్ రోడ్డు అభివృద్ధికి రూ.50లక్షలు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, మరుగుదొడ్లు, పెయింటింగ్‌లకు రూ.30లక్షలు, స్టాక్ యార్డు నిర్మాణానికి రూ.40లక్షలు, బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.25లక్షలు అదేవిధంగా మధిర రోడ్డు నుంచి పాత కూరగాయల మార్కెట్ మీదుగా ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.85లక్షలు, మునిసిపాలిటీలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్వహణకు రూ.80లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధుల మంజూరు పట్ల మునిసిపాలిటీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పది ఫెయిల్ అయినా ఉద్యోగం..

» 80కి పైగా కంపనీల్లో 5వేల ఉద్యోగాల కల్పన

» రేపు మెగా జాబ్‌మేళా.. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పది ఫెయిల్ అయినా వారితోపాటు ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమదేనని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ అన్నారు. సింగరేణి సంస్థ, టాస్క్ ఆధ్వర్యంలో సుమారు 80కి పైగా కంపనీలు 5వేల ఉద్యోగాల భర్తీ కోసం ఆదివారం సత్తుపల్లి పట్టణంలోని నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆమె రివ్యూ సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు ఎవరూ అధైర్యపడొద్దని, ఇంటర్వ్యూలలో ఎటువంటి తడబాటు లేకుండా కాన్ఫిడెంట్‌గా నిజాయితీగా సమాధానాలు చెప్పాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుంటే భవిష్యతులో కూడా ఉద్యోగాలకు పిలిచే అవకాశం ఉంటుందని సూచించారు. ఒక నిరుద్యోగికి ఉద్యోగం కల్పిస్తే ఆ కుటుంబం నిలబడుతుందని, ఆ దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు, కల్లూరు ఏసీపీ ఏ.రఘు, మునిసిపల్ కమీషనర్ కొండ్రా నర్సింహ్మాతో 5మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏఓలు, ఐకేపీ ఏపీఎంలు, సీడీపీఓలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థల నిర్వహకులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలి

» ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య



గ్యారేజీలో ఉద్యోగులకు సూచనలిస్తున్న డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులదే కీలకపాత్ర అని, డిపో ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ఖమ్మం డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య సూచించారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని సత్తుపల్లి, కల్లూరు, వీఎం.బంజర బస్టాండ్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి డిపోలో రికార్డులను తనిఖీచేసి ఏడీసీలు, కంట్రోలర్స్‌తో సమావేశం నిర్వహించి డీఎం ఊటుకూరి సునీత, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితీలకు పలు సూచనలు చేశారు. అనంతరం డిపో గ్యారేజీని సందర్శించి నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈపీకే, ఓఆర్ పెరిగే విధంగా చర్యలు తీసుకునేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలని చెప్పారు.

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం

ప్రయాణికులకు ఆత్మీయ స్వాగతం అనే నూతన కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని ప్రతి బస్సులో కండక్టర్, డ్రైవర్లు విధిగా ప్రయాణికులకు నమస్కరించి స్వాగతం పలకుతూ వారిని ఆత్మీయంగా పలకరించాల్సి ఉంది. ఎక్కడ నుంచి ఎక్కడికి బస్సు వెళ్తుంది, స్టాఫ్‌ల వివరాలు, గమ్యస్థానానికి ఎంతసేపటిలో చేరతామనే వివరాలను బాధ్యతగా ప్రయాణీకులకు తెలియజేస్తున్నట్లు సత్తుపల్లి డీఎం సునీత తెలిపారు.

రైల్వేలైన్ భూ నిర్వాసితులకు మార్కెట్ రేటు చెల్లించాలి

» ఎకరానికి రూ.91లక్షలు ఇవ్వాలని నిర్వాసితుల డిమాండ్

» నేటికి వాయిదా పడిన గ్రామసభ



స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కారేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్-భద్రాచలం రోడ్ రైల్వేలైన్ డబ్లింగ్ పనుల్లో వ్యవసాయ భూములు, సొంత ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు అధికారులు మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతూ భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరికి భూ నిర్వాసితులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైల్వే లైన్ డబ్లింగ్ భూ నిర్వాసితులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి పాల్గొని భూ సేకరణకు సంబంధించిన నిబంధనలను వెల్లడించారు. భూ నిర్వాసితులు ఇచ్చిన విన్నపాలను కూడా ఉన్నతాధికారులకు వివరిస్తానన్నారు. గ్రామసభలో పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ.. సింగరేణి రెవెన్యూ గ్రామం నాన్ ఏజన్సీ కాబట్టి వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.91లక్షలు, ఇండ్లు కోల్పోతున్న వారికి గజానికి రూ.20వేల చొప్పున మార్కెట్ రేటు చెల్లించాలని భూ నిర్వాసితులు కోరారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం మార్కెట్ వ్యాల్యూ చూసినా భూమికి అధికంగా ధరపలుకుతుందని, దాని ప్రకారం చెల్లించాలని కోరారు. వీటిపై సంబంధితపై అధికారులకు నివేదిద్వారా వివరిస్తానన్నారు.గ్రామసభలో తహసీల్దార్ రమేష్, రైల్వే జేఈ శ్రీకాంత్,ఏవో అశోక్,సర్వేయర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ గ్రామ సభను నేటికి వాయిద వేశారు.

వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థికి ప్రథమ బహుమతి



రోహన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న భూమేశ్వరరావు

వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పటాన్‌చెరువులోని మైత్రీ స్టేడియంలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో ఖమ్మంజిల్లా జట్టు ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ఖమ్మం జట్టులో ఉన్న వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థి దేవభక్తిని రోహన్ పోరాట పటిమ కనపర్చి జట్టు విజయతీరాలకు చేరడంలో కీలకంగా వ్యవహరించారు. రోహన్‌ను శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, భువన ప్రసాద్, ఏవో ఎస్.నర్సింహారావు అభినందించారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే



రికార్డులు పరిశీలిస్తున్న రాగమయి

పెనుబల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి ఆదర్శ పాఠశాలను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరుశాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా ఫలితాలను విశ్లేషించి విద్యార్థులు జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించినందుకు ప్రిన్సిపాల్ రూపస్, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. పాఠశాలలో కొరవడిన మౌలిక వసతులు, ఫర్నీచర్ తదితర అవసరాల గురించి ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తన నిధుల నుంచి వారం రోజుల్లో పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీపీఆర్‌ను సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామారావు

కొణిజర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన అలవర్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ.చంద్రశేఖరరావు తెలిపారు. మండలంలోని పెద్దమునగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. సామాజిక న్యాయం అందరికి ఉండాలన్నా, బలహీనవర్గాలకు న్యాయం కావాలన్నా, ప్రతి ఒక్క విద్యార్థి చట్టాల గురించి ముందే తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడ వద్దని, న్యాయ చట్టం 2012 గురించి వివరించారు. బాల్యవివాహాలు చట్టం గురించి తెలుసుకోవాలని, విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ వద్దని తెలిపారు. ఉచితంగా న్యాయ సహాయం అందించేందుక సిద్ధంగా ఉన్నామన్నారు. సంక్షేమ కార్యాలయ అధికారులు ఇతరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కేవీ

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

వైరా: విద్యార్థి దశనుంచే బాలికలు చట్టాలు-హక్కులపై అవగాహన పెంచుకోవాలని వైరా ఎస్ఐ పుష్పాల రామారావు సూచించారు. మండలంలోని ముసలిమడుగు సమీపంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు, మహిళా సిబ్బందికి బాల్యవివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టాల గురించి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామారావు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు ధైర్యంగా ముందుకు సాగాలని, మంచి చెడుల గురించి అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం షీటీం అందుబాటులో ఉందని, ఏ సమస్య వచ్చినా షీటీంను సంప్రదించాలని పేర్కొన్నారు. వైరా ట్రెయినీ ఎస్ఐ వెంపటి పవన్, కానిస్టేబుల్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి సుబ్బారావు

ఏన్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు పశువైద్యాదికారి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 14వరకు 3,150 పశువులకు టీకాలు వేసినట్టు తెలిపారు. శుక్రవారం అక్కినాపురంతండా, భగవాన్‌నాయక్ తండా, ఆరికాయలపాడు, హిమాంనగర్ గ్రామాల్లో 195టీకాలు వేసినట్టు తెలిపారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

సీతారామ ప్రాజెక్టు మైనర్ కాల్వల నిర్మాణ సర్వే ప్రారంభం

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలో గల బత్తులపల్లి, గోకవరం, లోకవరం, కల్లూరు, లక్ష్మీపురం గ్రామాల్లో శుక్రవారం సీతారామ ప్రాజెక్టు మైనర్ కాల్వల నిర్మాణంలో భూసేకరణ కోసం సర్వే పనులను చేపట్టారు. ఈ సర్వే ప్రధానంగా సదరు ప్రాజెక్టు పరిధిలో ఆయా గ్రామాలకు సంబంధించి దశల వారిగా మైనర్ కాల్వలను నిర్మించి తద్వారా గోదావరి జలాలు అందించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితంగా కల్లూరు ప్రాంతానికి సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్స్ అందుబాటులో రానున్నాయి. ఈ కాల్వల నిర్మాణం కోసం ముందుగా రెవెన్యూతోపాటుగా, ప్రాజెక్టు తరుపున ఇంజనీరింగ్ అధికారులు రైతులకు సంబంధించిన భూములను గుర్తించి తద్వారా సర్వే చేపట్టారు. అ క్రమంలో కల్లూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సుమారు 100 ఎకరాల భూమిని సేకరించడం జరుగుతుందని మండల తహసిల్దార్ పి సాంబశివుడు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ సర్వేలో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.28వేల వేతనం చెల్లించాలి

వైరా: మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు రూ.28వేల వేతనం చెల్లించాలని టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం మునిసిపల్ మేనేజర్ సుధాకర్‌కు అందజేశారు. ఆవుల అశోక్, యలదండి బాబు, సీవై.పుల్లయ్య, పర్సా బద్రీ, నాగరాజు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీవో



గిరిజన పాఠశాలలోని స్టోర్ రూంను పరిశీలిస్తున్న ఎంపీవో

కారేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగర్‌లో గల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం మండల ఎంపీవో రవీంద్ర ప్రసాద్ తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులంలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. ప్రధానంగా విద్యార్థులకు ఉపయోగించే నిత్యవసర సరుకులు, కూరగాయలను పరిశీలించారు. వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. విద్యార్థులకు సమయం ప్రకారం మెనూ అందించాలని సూచాంచారు. విద్యార్థులకు వడ్డించేందకు తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. భోజనం ప్రతి రోజు ఇలాగే వడ్డిస్తారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, డిప్యూటీ వార్డెన్ పవన్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో స్కూల్ గేమ్స్

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-14 కరాటే ఎంపికలు వచ్చే నెల 2వ తేదీన సత్తుపల్లిలో జరుగనున్నట్లు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పాల్గొనే బాలికలు, బాలురు 2012జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారై ఉండాలని, ఆదార్, స్టడీ సర్టిఫికేట్, 3పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జతపరచాలని కోరారు. ఇతర వివరాలకు వీ.పిచ్చయ్య (కరాటే-9441201769), కన్వీనర్ నాగేశ్వరరావు (9491891765), ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్.శ్రీదేవి (9848188402)ను సంప్రదించాలన్నారు.

మృత్యు కౌగిట్లో కోతి

తల్లాడ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని కోతిప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతుండగా చూసి సహచర వాననరమూక తల్లడిల్లిన సంఘటన శుక్రవారం తల్లాడలో జరిగింది. స్థాని జీఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో తల్లాడ-వరంగల్ ప్రధాన రహదారిపై కారు ఢీకొనడంతో కోతి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడింది. కోతి అరుపులు విని మిగిలిన వానరాలు వచ్చి కోతిని చూసి తల్లడిల్లిపోయాయి. కొద్దిసేపటిఇ కోతి మృతిచెందడంతో చుట్టుమూగాయి. మనసులు రాకుండా అడ్డుకున్నాయి.



ప్రధాన రహదారిపైకి వచ్చిన వానరమూక

హైవేపై ప్రమాదకరంగా గొయ్యి



పెనుబల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీం పట్నం నుంచి ఛత్తీస్‌ఘడ్ వెళ్లే జాతీయ రహదారి(ఎన్‌హెచ్-30) పెనుబల్లి మండలం సీతారాంపురం గ్రీన్‌ఫీల్డ్ హైవే సమీపంలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా తయారైంది. జాతీయ రహదారి పనుల్లో పటిష్టత లేకపోవడంతో ఈ రహదారిపై రెండు అడుగుల లోతు గొయ్యి ఏర్పడింది. ఈ రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఈ గోతిలో కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు పడితే ప్రమాదాలు సంభవించే అవకాశముంది. వెంటనే ఈ గొయ్యిని పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

పత్తి రైతులపై వరుణుడి ప్రతాపం

» వరుస వానలతో పొలాల్లోనే నిలిచిన పత్తితీత

» కూలీల కొరత, వానలతో రైతులు ఉక్కిరిబిక్కిరి



వరుస వానలతో దెబ్బతింటున్న పత్తి

బోనకల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వరుణుడు పత్తి రైతులపై కనికరం చూపడం లేదు. వరుస వానలు రైతులను కుంగదీస్తున్నాయి. ప్రతి ఏటా రైతులు వానాకాలం సీజన్లో అత్యధికంగా పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. బీటీ, హైబ్రిడ్ రకం పత్తి విత్తనాలు మార్కెట్లో దొరుకుతుండడంతో పంట ఏపుగా పెరిగి ఒక్క కాపు కాసిన పది క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందన్న ఆశ వారిని ముందుకు తీసుకెళ్తుంది. పత్తి పంట పూర్తైన తరువాత రెండవ పంటగా మక్క సాగు చేసి అదిక దిగుబడులు తీస్తున్నారు. ఏడాది కాలంలో రెండు పంటలు సాగు చేస్తుండడంతో కౌలు రైతులకు కూడా కొంత మేరకు కలిసి వస్తోంది. కానీ ప్రస్తుతం పత్తి సాగు చేసిన రైతులకు వానలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతుల పొలాలన్ని ఒకే సారి తీతకు రావడంతో కూలీల కొరతతో సతమతమవుతుండగా మరోవైపు ప్రతిరోజు కురుస్తున్న వర్షాలు చేతికందే పంటను దెబ్బతిస్తున్నాయి. పత్తి తడుస్తుండడంతో దానిని నిల్వ చేసే పరిస్థితి లేక గ్రామాల్లో దళారులకే రైతులు పంటను అమ్మేస్తున్నారు. తెగుళ్ల వల్ల దిగుబడి తగ్గినా, కనీసం చేలో ఉన్న పంటను కూడా ఇంటికి తెచ్చుకోవడానికి వెసులుబాటు లేకుండా వానలు తమ వెంట పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణానికి చెందిన నిరుపేద అయిన ఎస్కె జానీకి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో రూ.2.50లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కల్లూరు పట్టణ కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన శ్రీనివాసరావు హైదరాబాద్‌లో నిమ్స్‌లో మెడ నరాల వ్యాధితో వైద్య చికిత్స పొందుతున్న జానీని పరామర్శించారు. తమ కుటుంబ యాజమాని అనారోగ్యంగా ఉండగా సకాలంలో స్పందించి వైద్య చికిత్స అందించేందుకు ఆర్థికంగా సహకరించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్‌లకు జానీ కుటుంబం తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సత్తుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో వరి, పత్తి పంటకు తీవ్రంగా నష్టం ఏర్పడిందని, ఆరుకాలం పండించిన రైతన్నకు చివరికి మిగిలేది కన్నీరేనని, అందుకే దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏ.వెంకన్న, గంటా శ్రీను, అమర్లపూడి శరత్, ఒగ్గు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మధిర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు మధిర ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడపనుందని డిపో మేనేజర్ శంకర్‌రావు తెలిపారు. శుక్రవారం ప్రత్యేక బస్సు రూట్లకు చెందిన కరపత్రాన్ని డిపోలో ఆవిష్కరించారు, కార్తీక మాసం సందర్భంగా మధిర డిపో నుంచి పంచారామాలతో పాటు మధిర నుంచి అన్నవరంకు ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు మధిర బస్టాండ్ నుంచి బస్సు బయిల్దేరుతుందని తెలిపారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా నవంబర్ 5న తమిళనాడు లోని అరుణాచలంకు ప్రత్యేక బస్సు నడపడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 6301151730, 9063412754 నెంబర్లలో సంప్రదించవలసిందిగా తెలిపారు. డిపో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చమ్మకు నివాళులర్పించిన సండ్ర

తల్లాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామంలో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందిన గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు రెడ్డెం అచ్చమ్మకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెఎంకటవీరయ్య నివాళులర్పించారు. అచ్చమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. అచ్చమ్మ కుమారులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డిలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో తల్లాడ మండల కమిటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు వేమిరెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహ ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం

ముదిగొండ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం ఎడవల్లిలోని యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం భద్రాచలం డివిజన్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు.